

ఐటీఐ.. ప్రత్యేక కథనం 6లో
ఉపాధికి షార్ట్‌కట్

గట్టు జారిపోతోంది..

రివిట్‌మెంట్ పనుల్లో నాణ్యతాలోపం





నాసిరకం పనులు

నాసిరకం పనులతో నిర్మాణాలు చేపట్టడం వల్ల పది కాలాల పాటు పటిష్ఠంగా ఉండాల్సిన రివిట్‌మెంట్ ఆరు నెలలకే కొట్టుకుపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి కాంట్రాక్టర్ బాధ్యత వహించాలని. పటిష్ఠమైన పనులు తిరిగి చేపట్టాలని కోరుతున్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి):

రైతుల ఆశలపై నీళ్లు

విలువైన భూములను కాపాడేందుకు రిలయన్స్ సంస్థ సుమారు రూ.42 కోట్లు మంజూరు చేయడంతో లంక రైతులే గాక బడుగువానిలంక గ్రామ ప్రజలు ఆనందానికి అవధులు లేవు. ఈ నిధులతో భూములకు, ఊరికి రక్షణ వస్తుందని ఎంతో ఆశపడ్డారు. కానీ ఆశలన్నీ ఆరునెలలకే అడియాశలు అయ్యాయి. రివిట్‌మెంట్ కొట్టుకుపోతున్నాయని తెలుసుకుని వారంతా తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



నదీకోతకు కొట్టుకుపోయిన రివిట్‌మెంట్

ఎన్నికల ముందు హడావిడిగా

బడుగువానిలంకలో 1.5 కిలోమీటర్ల పొడవున రివిట్‌మెంట్ నిర్మాణానికి ఎన్నికల ముందు హడావిడిగా పనులు చేపట్టారు. అప్పటి కొత్తపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసైగలో ఓ కాంట్రాక్టర్ ఈ పనులను చేపట్టారు. ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ పనులు నిర్మించారు. అయితే అప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో నాసిరకం పనులు చేపట్టి బిల్లులు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలు ఇప్పుడు రాళ్లు కొట్టుకోవడం ద్వారా నిరూపణ అవుతున్నాయి. వాస్తవానికి ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి వేగంగా వచ్చే వరదనీటి ప్రవాహం అడ్డుకునేందుకు గ్రోయన్లు నిర్మించాల్సి ఉంది. కాని అలా చేయకుండా నేరుగా రివిట్‌మెంట్ పనులు చేపట్టారు. దీంతో గోదావరి నీటి ప్రవాహన్ని ఈ రివిట్‌మెంట్ రాళ్లు అడ్డుకోలేకపోయాయి. అంతేగాక లంక భూమి కోతకు గురికాకుండా వేసిన రాళ్లే ఎక్కడికక్కడ జాయిపోయాయి. కాంట్రాక్టర్ కక్కుర్తి పనులు బయటపడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూ.42 కోట్లు గోదావరి పాలు?

ఆరు నెలలకే కొట్టుకుపోతున్న రాళ్లు

నీరుగారిన లక్ష్యం

నిరాశలో లంక భూముల రైతులు

నదీకోతకు గురువుతున్న కోట్లాది రూపాయల విలువైన లంక భూములను కాపాడేందుకు రిలయన్స్ సంస్థ చేపట్టిన పనులు కాంట్రాక్టర్ చేతివాటంతో నిరుపయోగంగా మారాయి. ఆరు నెలలకే ఈ పనులలో లోపాలు బట్టబయలయ్యాయి. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామంలో లంక భూములు గత మూడు దశాబ్దాలుగా నదీ కోతకు గురవుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో సుమారు 650 ఎకరాల శ్రేష్ఠమైన లంకభూమి గోదావరిలో కొట్టుకుపోయింది. ఈ పరిస్థితిలో రిలయన్స్ సంస్థ ఈ గ్రామం మీదుగా ఆ సంస్థ పైపులైన్ నిర్మాణ పనులు పదిహేనేళ్ల క్రితం చేపట్టింది. అప్పటి నుంచి ఈ గ్రామానికి ప్రజోపయోగ పని ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకుంది. పెద్దమొత్తంలో నదీకోత నివారణ పనులకు నిధులు మంజూరు చేసింది. ఈ సంస్థ అనుబంధ సంస్థగా ఉన్న పైపులైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారు రూ.41.63 కోట్లు మంజూరు చేశారు.





జారిపోతున్న రివిట్‌మెంట్

గ్రామానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు



రివిట్‌మెంట్ పనులు శంకుస్థాపనకు విచ్చేసిన పైపులైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధికారులు, అప్పటి జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా బడుగువానిలంక గ్రామ పరిస్థితి చూచి రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాలకు రూ.రెండు కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఒక రూపాయి కూడా గ్రామానికి ఖర్చు చేయలేదు. చేసిన రివిట్‌మెంట్ పనులు నాణ్యత లేదు. అందుకే ఆరునెలలకే రివిట్‌మెంట్ కోట్టుకుపోతున్నాయి. అసలు ఎంత నిధులు ఖర్చు చేసింది అర్థం కాని పరిస్థితి

పదాల నాగలక్ష్మి, ఎంపీటీసీ

ముందుచూపు లేకుండా నిర్మాణం



రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రివిట్‌మెంట్ పనులలో ఎలాంటి ముందుచూపు పాటించలేదు. లంక భూములు నదీ కోతకు గురికాకుండా గ్రోయిన్స్ నిర్మించాల్సి ఉండగా మొత్తం అంతా రివిట్‌మెంట్‌తో సరిపెట్టేశారు. అందుకునే ఇంత త్వరగా కొట్టుకుపోతుంది. ఇప్పటికైన అధికారులు స్పందించి పటిష్ఠమైన రక్షణ చర్యలు చేపట్టాలి. మా భూములను కాపాడాలి.

దూలం లక్ష్మీనారాయణ, రైతు, బడుగువానిలంక

రెండేళ్లు నిర్వహణ చేయాల్సి ఉంది

రివిట్‌మెంట్ పనులు చేసిన రెండేళ్ల వరకు ఎటువంటి డ్యామేజ్ జరిగినా మళ్లీ నిర్మించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉంది. ఈ నిబంధనకు లోబడి పనులు నిర్వహించారు. అందువలన కాంట్రాక్టర్ రివిట్‌మెంట్ జారిపోయిన చోట మళ్లీ పనులు చేయాల్సి ఉంది. దీనిపై చర్యలు తీసుకుంటాం.. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం..

–విశ్వనాథరాజు, హెడ్‌వర్క్స్ ఇరిగేషన్ ఏఈ

8న జాతీయ ఉపకార వేతన పరీక్ష

అమలాపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి డిసెంబరు 8వ తేదీ ఆదివారం జాతీయ ఉపకార వేతన పరీక్ష జిల్లాలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 2815 మంది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతన పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరి కోసం మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 13 పరీక్షా కేంద్రాలను కేటాయించామన్నారు. 8వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ నుంచి స్కూలు లాగిన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యు డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేయాలన్నారు. అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 1239 మంది, రామచంద్రపురంలో 712, కొత్తపేటలో 864 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. అమలాపురం డివిజన్‌లో 6, కొత్తపేట డివిజన్‌లో 4, రామచంద్రపురం డివిజన్‌లో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద వసతులు కల్పించడంతో పాటు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలీసు యంత్రాంగం సహకారం తీసుకోనున్నట్లు డీఈవో షేక్ సలీం బాషా తెలిపారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణలో భాగంగా అధికారులకు విధులు కేటాయించామన్నారు.

గురువులకు నెలవు 6లో

టీచర్ల గ్రామం చినకొత్తలంక

మీపై ఒత్తిడి తీసుకొచ్చిన

ఆ రాజకీయ నేత ఎవరో చెప్పండి..!



ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మున్సిపల్ కమిషనర్‌ను నిలదీసిన అధికార, విపక్ష కౌన్సిలర్లు

మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆక్రమణలకు అనుమతులా?

కౌన్సిల్ ఆమోదం లేకుండా సొమ్ములు చెల్లించడం మీ ఇష్టమేనా

ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనంతో కౌన్సిల్‌లో గరం గరం చర్చ

అమలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ ప్రాంగణంలో ఓ ప్రైవేటు వ్యాపార సంస్థకు సంబంధించిన జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్, లెట్రిన్ ట్యాంకు, ఇతర పరికరాలను ఏర్పాటు చేసుకునేందుకు మున్సిపల్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న ఆ కీలక నేత ఎవరో బహిర్గతం చేయాలని మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్సీతో సహా జనసేన, టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు ముక్త కంఠంతో విరుచుకుపడ్డారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో యథేచ్ఛగా ఆక్రమణలు శీర్షికన ప్రచురితమైన వార్తా కథనంపై గంట సేపు తీవ్ర చర్చ జరిగింది. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును వివరణ ఇవ్వాలని కౌన్సిల్ ముక్తకంఠంతో పట్టుబట్టింది. ఈ వ్యవహారంపై సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి దాటవేత వైఖరిని ప్రదర్శించారు. తాను రెండు రోజులు మున్సిపల్ కార్యాలయానికి రాలేదని, ఆ సమయంలోనే కార్యాలయం ముందు భాగంలో సిబ్బంది సైకిళ్లు పెట్టుకునే ప్రాంతంలో జనరేటర్, పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి సిమ్మెంటు దిమ్మ కట్టి ఉండడాన్ని చూశానన్నారు. కమిషనర్‌ను పిలిపించి అడిగామన్నారు. రాజకీయ ఒత్తిళ్ల వల్ల వాటిని ఇక్కడ పెట్టడం జరిగిందని కమిషనర్ చెప్పినట్టు చైర్‌పర్సన్ సభకు వివరించారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.9లక్షలు కట్టాలన్న విషయాన్ని తన దృష్టికి తీసుకురాలేదని నాగేంద్రమణి పేర్కొన్నారు. ఆ తర్వాత ఈ ఆక్రమణలపై వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మున్సిపల్ అధికారులు అనుసరిస్తున్న తీరుపై నిప్పులు చెరిగారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి సంబంధించిన పేపరును సభలో ప్రదర్శిస్తూ దీనిపై వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. రాజకీయ ఒత్తిళ్లతో కాంట్రాక్టర్లతో రాజీ పడితే కౌన్సిల్ చూస్తూ ఊరుకోదని ఎదురు దాడికి దిగారు. అంత ఒత్తిళ్లు తెచ్చిన రాజకీయ నేతల పేర్లను బహిర్గతం చేయాలని బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, పిండి అమరావతి, తిక్కా సత్యలక్ష్మిలతో పాటు మరి కొందరు కమిషనర్‌ను నిలదీశారు. కమిషనర్ రాజు వివరణ ఇస్తూ మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.9లక్షలు ట్రాన్స్‌ఫార్మర్ కోసం సీఎఫ్ఎంఎస్ ద్వారా ట్రాన్స్‌కోకు చెల్లించేలా బిల్లు అప్‌లోడ్ చేశామని, ఇంకా అవి ట్రాన్స్‌కో అక్కౌంట్‌కు వెళ్లలేదని కమిషనర్ వివరణ ఇచ్చారు. దీనిపై స్పందించిన సభ్యులు ఆ నిధులను తక్షణమే వెనక్కు తీసుకురావాలని డిమాండు చేశారు. ఈ చర్చలో అధికార వైసీపీ, ప్రతిపక్ష కౌన్సిలర్లు రుద్రరాజు నానిరాజు, మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, అబ్బిరెడ్డి చంటి, గండి దేవిహారిక, పడాల శ్రీదేవి పాల్గొని మాట్లాడారు.

షాపుల లీజుల అంశంపై కౌన్సిల్‌లో వాడివేడి చర్చ

అమలాపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘంలో రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అధికార, విపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పురపాలక సంఘానికి సంబంధించిన షాపులను ఒకరు లీజుకు తీసుకుంటే మరెవరో వ్యాపారాలు చేస్తున్నా పట్టించుకోరా అని ధ్వజమెత్తారు. షాపుల లీజులకు సంబంధించిన సమాచారాన్ని అందించాలని పట్టుబట్టారు. దాంతో అప్పటికప్పుడు లీజు నియమ నిబంధనలు వివరిస్తూ 40 అంశాలతో ముద్రించిన పత్రాలను కౌన్సిల్ సభ్యులకు అందించారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగింది. ఈ ఏడాది జనవరి నెలాఖరుతో షాపుల లీజులు పూర్తి అయితే ఇప్పుడు కౌన్సిల్ ముందుకు షాపుల లీజులు తీసుకురావడం ఏమిటని అధికార పక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ప్రశ్నించారు. అంటే 11 నెలలుగా ఆ షాపుల యజమానులు అద్దెలు చెల్లించడం లేదా అని మండిపడ్డారు. కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు కల్పించుకుని ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల జాప్యం జరిగిందని వివరణ ఇవ్వబోగా ఐదు నెలలుగా ఎన్నికల కోడ్ ఎక్కడ ఉందని సభ్యులు నిలదీశారు. లీజుకు పొందిన షాపులకు సంబంధించి సాల్వెన్సీలు, అడ్వాన్సులు తీసుకోకపోవడం వల్ల యజమానులు చెప్పాపెట్టకుండా షాపులకు తాళాలు వేసి అధికారులకు ఇచ్చి వెళ్లిపోతున్న తీరుపై మండిపడ్డారు. కొవిడ్ సమయంలో షాపులు తెరవకపోయినా వడ్డీతో సహా మున్సిపల్ షాపుల అద్దెలు చెల్లించామని, ప్రస్తుతం అద్దె పెంపు భారంగా మారిందని సర్క్యులర్ బజార్ వ్యాపారులు ఇచ్చిన వినతిపత్రంపై చర్చ నిర్వహించారు. కౌన్సిలర్లు గండి దేవిహారిక, సంసాని బులినాని, యేడిద శ్రీను, నాగేంద్రలు చర్చించిన అనంతరం కొద్దిపాటిగా అద్దెలు పెంచేందుకు తీర్మానిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పురపాలక సంఘ అనుమతి లేకుండా షాపును లీజుకు పొందిన వ్యక్తి మరొకరికి బదిలీచేస్తే ఈ లీజును రద్దు చేయాల లేదా అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ నిలదీశారు. చివరకు భాగస్తులతో కూడా వ్యాపారం చేయరాదని, లీజు నియమ నిబంధనలు తెలుపుతున్నప్పటికీ ఎందుకు పట్టించుకోరని నిలదీశారు. పట్టణంలో పురపాలక సంఘానికి సంబంధించి 50 షాపులను లీజుకు పొందినవారెవరు ఇప్పుడు ఎవరెవరికి సబ్ లీజుకు ఇచ్చారో చెప్పాలని ఇజ్రాయిల్ పట్టుబట్టారు. సమావేశంలో కౌన్సిలర్లు పిండి అమరావతి, బొర్రా వెంకటేశ్వరరావు, ఆశెట్టి నాగదుర్గ, వాసర్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాడివేడిగా చర్చ జరుగుతున్న దృశ్యం

సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు పరిధిలో

పది డీసీలు

గెజిట్ ఉత్తర్వులు జారీ

అమలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సెంట్రల్ డెల్టా మేజర్ ఇరిగేషన్ సిస్టమ్ ప్రాజెక్టు పరిధిలో పది డీసీ కమిటీలను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ డెల్టా పరిధిలోని వివిధ మండలాల్లో డీసీ పరిధిలోకి వచ్చే గ్రామాలను వివరిస్తూ నోటిఫికేషన్ వెలువడింది. దీనిలో భాగంగా కోనసీమలోని కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గ పరిధిలోని డీసీ పరిధులను వివరిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్తపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లోని గోపాలపురం డీసీ పరిధిలో వద్దిపర్రు, ఆత్రేయపురం, అంకంపాలెం, రావులపాలెం, మెర్లపాలెం, గోపాలపురం, జి.పెదపూడి గ్రామాలు ఉన్నాయి. అదేవిధంగా అవిడి డీసీ పరిధిలో ఎల్.పోలవరం, దేవరపల్లి, అవిడి, ఇసుకపురం, కె.పెదపూడి, అమలాపురం డీసీ పరిధిలో నేదునూరు, గూడాల, తాడికోన, రెడ్డిపల్లి, చెయ్యేరు, అల్లవరం డీసీ పరిధిలో కిత్తనచెరువు, గోపవరం, గోడిలంక, దేవగుప్తం, బెండమూర్లంక, కొమరగిరిపట్నం ఉన్నాయి. మురమళ్ల డీసీ పరిధిలో శానపల్లిలంక, గుత్తెనదీవి, కేశనకుర్రు, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి గ్రామాలు ఉన్నాయి. కాట్రేనికోన డీసీ పరిధిలో చినగాడవిల్లి, కాట్రేనికోన, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు ఉన్నాయి. పి.గన్నవరం డీసీ పరిధిలో గన్నవరం, మానేపల్లి, తాటిపాక, కడలి, పొన్నమండ, పొదలాడ ఉన్నాయి. అయినవిల్లి డీసీ పరిధిలో వాడపాలెం, పసుమెల్ల, అయినవిల్లి, ముమ్మిడివరం, అనాతవరం ఉన్నాయి. రాజోలు డీసీ పరిధిలో లక్కవరం, రాజోలు, రామరాజులంక, మలికిపురం, అంతర్వేది, గొంది, సఖినేటిపల్లి ఉన్నాయి. ఉప్పలగుప్తం డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో చల్లపల్లి, ఎస్.యానాం, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం, ఎస్.కొత్తపల్లి ఉన్నాయి.

తుఫాన్ హెచ్చరికలతో అలజడి

జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



ఉప్పలగుప్తం మండలంలో ధాన్యం బస్తాల తరలింపు

అమలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర తుఫాన్‌గా మారనుండడంతో జిల్లాలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టరేట్ అధికారులు కోరారు. రానున్న నాలుగు రోజుల పాటు జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాల వరకు కురుస్తాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు కూడా అప్రమత్తతతో ఉండాలని కోరింది. జిల్లాలోని అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అత్యవసర సమయాల్లో సహాయం పొందేందుకు కంట్రోల్ రూములను ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము నంబరు 08856 293104, అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో 08856 233208, కొత్తపేట ఆర్డీవో కార్యాలయం 08855 244299, రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం 08857 245166లలో సంప్రదించాల్సిందిగా ప్రకటనలో కోరారు. అయితే జిల్లాలో క్రమంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్న దృష్ట్యా అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. సరిగ్గా పంట చేతికి వచ్చే సమయంలో వాయుగుండాలు, తుఫాన్‌లు రావడం వల్ల పంటను ఒబ్బిడి చేసుకునే పరిస్థితులు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలు సడలించి రైతులకు వెసులుబాటు ఇవ్వాలని కోరుతున్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

అమలాపురంలో అండర్-14

బాలుర జట్ల మధ్య మ్యాచ్‌లు

ఉమ్మడి జిల్లాల నుంచి రాక

అమలాపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో అంతర్ జిల్లాల బాలుర అండర్-14 క్రికెట్ పోటీలను అమలాపురం వేదికగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అమలాపురంలోని బాలయోగి స్టేడియంతో పాటు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కిమ్స్ క్రీడా ప్రాంగణాల్లో ఈ నెల 28, 29, 30 తేదీల్లో క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి ఇప్పటికే క్రీడాకారులు వంద మంది బాలయోగి స్టేడియానికి చేరుకున్నట్టు ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్, డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయస్థాయి అండర్-14 బాలుర విభాగం పోటీలకు జట్టుగా ఎంపిక చేస్తామన్నారు. మూడు క్రీడా ప్రాంగణాల్లో నిర్వహించే క్రికెట్ పోటీల ఏర్పాట్లను, క్రీడాకారుల భోజన వసతి సౌకర్యాలను కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో పర్యవేక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులతో డీఈవో సమావేశం నిర్వహించి ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా



ఒకప్పుడు ఐటీఐలో చదివారంటే ఉద్యోగం గ్యారంటీ. అప్పట్లో ఏ కోర్సుకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటే అంతా అదే ట్రేడ్‌లో చేరిపోయేంత క్రేజ్ నడిచేది. టెక్నాలజీకి పర్యాయపదం ఐటీఐ. ఇంజనీరింగ్ కాలేజీలు వచ్చాక ఆ ప్రభ కొంత తగ్గింది. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు విస్తృతంగా పెరగడం, ఫీజు రీయంబర్స్‌మెంటు ద్వారా పేదవర్గాల వారూ చదువుకునే అవకాశం కలగడంతో ఐటీఐ దాదాపు కనుమరుగైపోయింది. కానీ కొవిడ్ తర్వాత పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు చదివేవారు మళ్లీ పెరిగారు. ప్రాక్టికల్ నాలెడ్జికి పెద్దపీట వేసే ఐటీఐకి ఆదరణ పెరిగింది. స్వల్ప వ్యవధిలో ఉపాధి అవకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కని దారి. అంతేకాదు.. ఇంకా చదవాలంటే అటు పాలిటెక్నిక్‌లో చేరి అనంతరం ఇంజనీరింగ్ పూర్తిచేసే బ్రిడ్జి కోర్సు సైతం ఉండడం విశేషం.

ఐటీఐ.. ఉపాధికి షార్ట్‌కట్!


(ఆంధ్రజ్యోతి- కాకినాడ కార్పొరేషన్)

- పారిశ్రామిక వృద్ధితో నిపుణులకు పెరుగుతున్న అవకాశాలు
- ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో అందుబాటులో వేలాది సీట్లు
- ఐటీఐల్లో మొత్తం 13 ట్రేడ్లు
- స్కిల్ హబ్ ద్వారా ఎన్నో ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్

పది తర్వాత కేవలం రెండేళ్ల కోర్సు పూర్తిచేస్తే ఉద్యోగం పొందే అవకాశం ఐటీఐలో మాత్రమే ఉంది. ఈ కోర్సు పూర్తి చేసి అప్రెంటీస్ చేస్తుండగానే జీవితంలో స్థిరపడడానికి వీలుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక రంగం వేగవంతంగా వృద్ధి చెందుతుండడంతో ఐటీఐ చేసిన వారికి సులువుగా జీవనోపాధి పొందవచ్చు. పూర్వం ఐటీఐ చదివారంటే ఉపాధి అవకాశాలు పొందడం గ్యారంటీ అనే పరిస్థితి ఉండేది. ఇంజనీరింగ్ కాలేజీలు అందరికీ అందుబాటులోకి రావడంతో కొన్నేళ్లపాటు అందరూ అటు వైపే వెళ్లారు. కొవిడ్ తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అనేక మార్పులొచ్చాయి. ప్రాథమిక స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం పొందిన వారికి కూడా ఏదొక ఉపాధి దొరుకుతోంది. దానికి అనుగుణంగా పారిశ్రామిక విస్తరణ మరిన్ని అవకాశాలను కల్పిస్తోంది. నిర్మాణ రంగం మరెన్నో చిరుద్యోగాలను సృష్టిస్తోంది. దాంతో స్వల్ప వ్యవధిలో ఉపాధి పొందడానికి ఐటీఐలు దోహదం చేస్తున్నాయి. ఐటీ రంగం కుదేలు కావడంతో టెక్నికల్ కోర్సుల వైపు విద్యార్థులు మళ్లడానికి మరో కారణమైంది. పది తర్వాత ఐటీఐ పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు పొందడానికి మార్గం ఉంటుంది. విద్యుత్, రైల్వే రక్షణ, పలు ప్రభుత్వ ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడ్స్‌లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహంలేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్ ఏర్పాటుచేసి విద్యార్థులకు నైపుణ్యాంశాలపై శిక్షణ ఇస్తోంది. ఒకవేళ ఐటీఐ పూర్తి చేసిన వారు ఇంకా చదవాలనుకుంటే పాలిటెక్నిక్ డిప్లమోలో నేరుగా రెండో సంవత్సరం ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఏడాది, రెండేళ్ల వ్యవధితో కోర్సులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడలో అతి పెద్ద ఐటీఐ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఉంది. ఇది ప్రస్తుత కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు ఉమ్మడిగా కొనసాగుతోంది. కాకినాడ జిల్లాలో మరొక ప్రభుత్వ ఐటీఐ ఉంది. మొత్తం కాకినాడ, జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐలలో 728 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఉంది. ఇవికాకుండా ప్రైవేటు ఐటీఐలు ఒక్కో జిల్లాలో డజను వరకు ఉండి.. వేలాది సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంచాయి. ఆయా ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ తదితర కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరాలనుకునే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. ఇందులో విద్యార్థులతోపాటు విద్యార్థినులకు కూడా కోర్సులు ఉన్నాయి. దరఖాస్తుల పరిశీలన పూర్తైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు.

ఉపాధికి ఢోకా లేదు..

ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తిచేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశముంది. ఐటీఐ పూర్తిచేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశముంది. పాలిటెక్నిక్ పూర్తి చేసి బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపరుచుకోవచ్చు. ఇలా పలువురు విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి బాగా స్థిరపడుతున్నారు.

ఈ ఏడాది 338 మందికి ప్లేస్‌మెంట్స్

ఇక కాకినాడ ప్రభుత్వ ఐటీఐకి సంబంధించి ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల్లో 487 మందికి ఈఏడాది క్యాంపస్ ఇంటర్వ్యూలు ద్వారా ప్రముఖ కంపెనీలైన ఎల్‌అండ్‌టీ, ఏపీ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఐటీసీ లిమిటెడ్, బ్లువాసన్, ఎలైడ్ సర్వీసెస్, న్యూకాన్, ఏరోస్పేస్, వోల్‌మాన్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీల్లో 338 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మిగిలిన వారికి త్వరలోనే ప్లేస్‌మెంట్ అవకాశాలు ఏర్పాటుచేయనున్నారు. వందశాతం ప్లేస్‌మెంట్ పూర్తవ్వనుంది.

100 శాతం ప్లేస్‌మెంట్ దిశగా..




ఉద్యోగం సంపాదించి స్థిరపడాలనుకునే వారి కి ఐటీఐ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయి. దరఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరుకావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్ నెంబర్‌కు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయి. విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్ కల్పించాలన్నదే మా ప్రధాన ఉద్దేశం.

- ఎంవీజీ వర్మ, కాకినాడ గవర్నమెంటు ఐటీఐ ప్రిన్సిపల్, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్



గురువులకు నెలవు!


దివంగత పొత్తూరి చంద్రరాజు (మేడ చంద్రరాజు)


దివంగత పొత్తూరి సత్యనారాయణరాజు

చదువు జీవితానికి మార్గదర్శి, సంస్కారానికి దిక్సూచి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ చక్కని రహదారి. ఒక కుటుంబంలో చదువుకున్న వారుంటే ఆ వంశవృక్షం ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతుంది. ఉన్నత శిఖరాలను అందుకుంటుంది. ఇది ఒక కుటుంబ విజయం కాదు.. ఒక ఊరి విజయం.. ఊరంతా టీచర్లు కావడానికి ఒకనాడు పడిన బీజం.. ఆ సంగతేంటో చదవండి...

(ఆంధ్రజ్యోతి-ముమ్మిడివరం)

అదొక చిన్న గ్రామం.. అయితే ఆ గ్రామంలో గడపగడపకొక టీచరు ఉండడం విశేషం. ఎందరో విద్యావేత్తలను, మేధావులను తీర్చిదిద్దిన ఘనత ఆ గ్రామానికి ఉంది. ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామం ఉపాధ్యాయులకు నెలవు. గ్రామ జనాభా 1561 కాగా 652 కుటుంబాలు ఉన్న ఆ గ్రామంలో వందమందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారంటే విశేషమే కదా మరి. వీరిలో 60 మంది కాలంచేయగా మరో 20 మంది విశ్రాంత ఉపాధ్యాయులుగా ఉన్నారు. ప్రస్తుతం వివిధ గ్రామాల్లో 25 మంది వరకు నేడు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరిలో సగంమంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరు కాకుండా ప్రైవేటు పాఠశాలల్లో 15 మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరో 15 మంది ఎన్ఐఆర్‌లు, తెలంగాణ రాష్ట్రంలో 15 మంది ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి పొందుతుండగా, రక్షణ, పోలీసుశాఖ, ఆర్టీసీ, విద్యుత్, తపాలా శాఖ, టెలిఫోన్ శాఖ, ఆరోగ్య, పంచాయతీరాజ్, సబ్ రిజిస్ట్రార్, కోఆపరేటివ్ బ్యాంకుల్లో ఇంకో 25 మంది వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 1917లో గ్రామంలో పొత్తూరి చంద్రరావు (మేడచంద్రరాజు) ఆధ్వర్యంలోను బాలుర ఎయిడెడ్ పాఠశాల, పొత్తూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో బాలికల ఎయిడెడ్ పాఠశాల స్థాపించి ఉపాధ్యాయులను నియమించి ఎంతోమందికి విద్యాబోధన చేశారు. 1950లో అదే గ్రామానికి చెందిన వీపూరి కృష్ణంరాజు ఐ.పోలవరంలో ఒక ఎయిడెడ్ పాఠశాలను ఏర్పాటుచేసి చినకొత్తలంక నుంచి కాలినడకన సుమారు ఆరు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి విద్యాబోధన సాగించేవారు. ఆనాటి నుంచి నేటి వరకు చినకొత్తలంక గ్రామం ఉపాధ్యాయులకు పుట్టినిల్లుగా ఉంది. ప్రతీ కుటుంబం నుంచి ఒక ఉపాధ్యాయుడు డీఎస్సీలో ఎంపికకావడంతో ఆ గ్రామం ఉపాధ్యాయుల గ్రామంగా పేరొందింది. కొంతమంది డీఎస్సీలో సెలక్ట్ కాగా ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరికొంతమంది ప్రైవేటు విద్యాసంస్థలు ఏర్పాటుచేసి విద్యాబోధన సాగిస్తున్నారు. గ్రామంలో విద్యావంతులు ఎక్కువగా ఉండడంతో ఆ గ్రామం అభివృద్ధిలో ముందుంది. పాఠశాలకు పక్కా భవనం, అంగన్‌వాడీ భవనం, గ్రంథాలయ భవనం, కమ్యూనిటీ భవనం, మహిళా మండలి భవనం వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి.

వారి స్ఫూర్తితోనే ఉపాధ్యాయ వృత్తి



గ్రామంలో పొత్తూరి చంద్రరాజు, పొత్తూరి సత్యనారాయణరాజు, వీపూరి కృష్ణంరాజుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలో స్వీకరించా. మా కుటుంబంలో పెదనాన్న, చిన్నాన్న, బావలు ఉపాధ్యాయులుగా పనిచేశారు. అందువల్లే నేను, మా పిల్లలు ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకున్నాం. ఎంతోమందికి విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన తృప్తి ఉంది. ఉపాధ్యాయ సంఘంలో చురుకైన పాత్ర పోషించి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశా. ప్రస్తుతం విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా.

- పీవీవీ సత్యనారాయణరాజు, రిటైర్డ్ ఉద్యోగ సంఘ ప్రధాన కార్యదర్శి

అభివృద్ధికి విద్యే మూలం



పెద్దల స్ఫూర్తితోనే ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చా. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు చదువుతోపాటు మానసిక వికాసం చెందేలా బోధన చేస్తున్నా. కొవిడ్‌లో యూట్యూబ్ చానల్ ద్వారా ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించాను. నా వినూత్న బోధనా పద్ధతులను మెచ్చుకుని 2003లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలపై కూడా పోరాటాలు సాగించేందుకు ఉపాధ్యాయ సంఘ మండల శాఖ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నా. నేను పొందిన విజ్ఞానాన్ని నలుగురికి పంచాలన్నదే నా ఆశయం.

- పి.హిమబిందు, ఉపాధ్యాయిని, చినకొత్తలంక


ట్రాక్టర్లపై దేవతామూర్తుల అలంకరణలతో ప్రదర్శన

ప్రత్తిపాడులో వైభవంగా గౌరీదేవి సంబరాలు

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో గౌరీదేవి సంబరాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ముస్సుబ్ వారి రామాలయం వీధిలోని గౌరీ శంకర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్లపై కళాకారులు లవకుశలు, సీతారామ లక్ష్మణులు, పార్వతీపరమేశ్వరులు, ఆంజనేయుడు, వినాయకుడు, కనకదుర్గ, సాయిబాబా వేషధారణల్లో అలరించారు. బాణసంచా, డప్పుల వాయిద్యాల మధ్య కళారూపాల ప్రదర్శన గ్రామ పురవీధుల గుండా కొనసాగింది.

బాల్య వివాహాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత... బాల్య వివాహాలు సాంఘిక దురాచారం: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకునే బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత స్పష్టం చేశారు. జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా అన్ని చర్యలూ చేపడుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం రాత్రి జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'బాల్య వివాహ ముక్త్ భారత్' కొవ్వొత్తుల ర్యాలీని వారు ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీజే మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమే కాకుండా తగు వయసు రాకుండా పెళ్లి చేయడం వల్ల విద్య, ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్నారు. బాల్య వివాహాల నిరోధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీ, ఆశా, మహిళా పోలీసులకు అవగాహన


కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత, కలెక్టర్ ప్రశాంతి

కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 18ఏళ్లలోపు ఆడపిల్లలు, 21ఏళ్లలోపు మగ పిల్లలకు వివాహం చేస్తే వారిని ప్రోత్సహించిన వారు, సమాచారం తెలిసి దాచిన వారు, పెళ్లి చేసిన వాళ్లు కూడా చిక్కుల్లోపడక తప్పదన్నారు. రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఉంటే ప్రభుత్వ అధికారులకు లేదా పారా లీగల్ వలంటీర్లకు సమాచారం ఇవ్వడం బాధ్యతగా భావించాలన్నారు. దేశంలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకూడదనే ఉద్దేశంతో 'బాల్య వివాహ ముక్త్ భారత్' విస్తృతంగా నిర్వహిస్తున్నారన్నారు. బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఉన్న వాళ్లు వెంటనే తహసీల్దారు, పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. తద్వారా ఆ వివాహాన్ని నిలిపివేయడం సాధ్యమవుతుందని, వారికి రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా సైక్లింగ్ పోటీలకు 30, 1 తేదీల్లో క్రీడాకారుల ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్/కాకినాడ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా సైక్లింగ్ పోటీలు, జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 30, డిసెంబరు 1 తేదీల్లో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడంలోని గుడ్‌రోల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్వహిస్తున్నట్టు తూర్పు గోదావరి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి డీఎంఎం శేషగిరి, కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల సైక్లింగ్ క్రీడాకారులు తమ సైక్లింగ్ ఎక్విప్‌మెంట్‌తో మందడంలో 30వ తేదీ ఉదయం రిపోర్టు చేయాలని సూచించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను డిసెంబరు 7 నుంచి 10వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జరిగే 29వ జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌కు పంపిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు సైక్లింగ్ కోచ్ వెంకటరావు (గుంటూరు) 9849379932, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (గుంటూరు) 9703092077 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా సమాఖ్య కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. కాకినాడ డీఎస్ఏ మైదానంలో అండర్-17 బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు చేరుకున్నారని, వారికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.




చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న విధు శేఖర భారతీ స్వామి, భక్తులకు అనుగ్రహభాషణ

ధర్మాచరణతోనే శ్రేయస్సు

శృంగేరీ జగద్గురు విధు శేఖర భారతీ మహా స్వామి

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'శ్రేయస్సు కావాలనుకుంటే ధర్మం పాటించాలి.... కష్టాలు వద్దనుకుంటే అధర్మాన్ని పరిత్యజించాలి... ధర్మం, అధర్మంతోనే సుఖదుఃఖాలు ఉంటాయి. కర్మానుసారం వాటిని అనుభవిస్తారు' అని శృంగేరీ జగద్గురు విధు శేఖర భారతీ మహాస్వామి ఉద్బోధించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టున వున్న త్యాగరాజ నారాయణదాస సమితి ప్రాంగణంలోని శ్రీశృంగేరి శంకర మఠంలో బుధవారం రాత్రి జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆధునిక కాలంలో అనేక సౌకర్యాలు పెరిగాయి. విజ్ఞానం పెరిగింది కదా. ఇపుడు కూడా సనాతన ధర్మం అదీ ఇదీ అంటూ అవసరమా అని కొందరు అడుగుతుంటారు. వారికి నేనొక్కటే చెప్తాను. సౌకర్యాలు, టెక్నాలజీ పెరిగిన మాట వాస్తవమే. మహానుభావులు ఎవరో యంత్రాలు కనిపెడితే చాలా మంది అనుభవిస్తున్నారు. అయినా ప్రపంచంలో దుఃఖం అనేది తగ్గలేదు. వేరే మార్గాల్లో దుఃఖం వస్తుంది. సుఖమూ ఉందన్నారు. గతంలో లేని రోగాలు, మనకు పేరు కూడా తెలియని రోగాలను వింటున్నామన్నారు. సౌకర్యాల వల్ల దుఃఖం నివారించినా, మరో రూపంలో వస్తుందని విశదీకరించారు. దేవుడిచ్చిన మేరకు కష్టపడి సంపాదించుకుని అనుభవించాలి. సంపాదించింది అనుభవించకపోతే ఉపయోగం లేదు. అదే సమయంలో ధర్మ పాలనా ఉండాలని బోధించారు. ఇవి రెండూ జరిగితేనే హాయిగా ఉంటుందన్నారు. మనిషికి ధర్మమార్గం అత్యంత ఆదర్శం. సనాతన ధర్మం గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలి. ప్రతి విషయం వెనుక ఓ కారణం కచ్చితంగా ఉంటుంది. అన్నీ అర్థం చేసుకునే సామర్థ్యం మనకు లేకపోవచ్చు. పూర్వమే రుషులు వాటి సారాన్ని మనకు అందించారని వివరించారు. ప్రతి మనిషికీ జిజ్ఞాస ఉండాలని, వితండ వాదన మంచిది కాదని జిజ్ఞాసతో ప్రశ్నించి గొప్పతనం తెలుసుకోవాలన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్ (ఆంధ్రజ్యోతి): విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్వత్సభ జరిగింది. పండితుల వేద ఘోషతో ఆ ప్రాంగణం ప్రతిధ్వనించింది. శతావధాని గన్నవరపు లలితాదిత్యచే అష్టావధానం రసవత్తరంగా సాగింది. పృచ్ఛకులుగా కడిమెళ్ల వరప్రసాద్, ఆచార్య శలాక రఘునాథ శర్మ, ధూళిపాళ మహదేవమణి, పాలపర్తి శ్యామలానంద, తాతా సందీప్ శర్మ, ఆకెళ్ల బాలభాను పాల్గొనగా సంచాలకర్తగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణ వ్యవహరించారు.


అష్టావధానాన్ని వీక్షిస్తున్న విధు శేఖర భారతీ స్వామి


ఎంపికైన అనన్య, ఎం.ఝాన్సీశ్రీ

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఐ.పోలవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగం సాఫ్ట్ బాల్ జాతీయ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం హైస్కూలు విద్యార్థినులు హెచ్.అనన్య, ఎం.ఝాన్సీశ్రీ ఎంపికైనట్టు హెచ్‌ఎం సలాది వెంకటనారాయణ తెలిపారు. చిత్తూరు జిల్లా అరకొండలో జరిగిన పోటీల్లో వారి ఎంపిక జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను, పీడీ కళావతి, పీఈటీ అడ్డగళ్ల రామ్‌ప్రసాద్‌ను పీఎంసీ చైర్మన్ బసవా అప్పారావు అభినందించారు.

మనాలీ పర్వతారోహణలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల విద్యార్థులు

రాజానగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనాలీలో నిర్వహించిన పర్వతారోహణలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అయిన ఎంబీబీఎస్ విద్యార్థులు ముళ్లపూడి చైతన్యరాజ్, కస్నేటి హర్ష పాల్గొని కోర్సు సీనియర్ హోదా అందుకున్నారని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వాటి మాధవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ సంస్థ ఇటీవల మనాలీలో నిర్వహించిన సాహసోపేతమైన పర్వతారోహణలో దేశవ్యాప్తంగా ఎంపికైన 90 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో ఏపీకి చెందిన 10 మంది వున్నారన్నారు. తమ కళాశాలకు చెందిన చైతన్యరాజ్ దేశవ్యాప్తంగా ఉన్న రోప్‌లీడర్లు, వలంటీర్లకు నాయకత్వం వహించి కోర్సు సీనియర్ హోదా అందుకున్నాడన్నారు. సాహసికులను జీఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కే మిశ్రా అభినందించారు.


చైతన్యరాజ్, హర్షలను అభినందిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ సందీప్

అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో త్రినాథరావు

అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా వేంద్ర త్రినాథ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సత్యదేవుడిని దర్శించుకోగా ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనివేటి మండపంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కార్యాలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై తొలిసంతకం చేశారు. గతంలో రెండు పర్యాయాలు ఈవోగా ఆయన అన్నవరంలో బాధ్యతలు నిర్వహించారు.

రామచంద్రమోహన్‌కు వీడ్కోలు

గతేడాది కార్తీకమాసంలో అన్నవరం ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రమోహన్ దేవదాయశాఖ ప్రధాన కార్యాలయానికి వెళ్లడంతో ఆయనకు బుధవారం దేవస్థానం ఉద్యోగులు వీడ్కోలు సభ ఘనంగా చేపట్టారు. ఈ ఏడాది కార్తీకమాసంలో గిరిప్రదక్షిణ నిర్వహణ, కార్తీకమాసంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చేపట్టిన చర్యలపై ఆయనను ప్రశంసించారు. రామచంద్రమోహన్ దంపతులను చైర్మన్ రోహిత్, నూతన ఈవో త్రినాథరావులు సత్కరించారు.



రామచంద్రమోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారుల పర్యటన



గొల్లప్రోలులో పరిశీలన చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారుల బృందం

గొల్లప్రోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు చెందిన అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూనిట్ మేనేజ్‌మెంట్ అధికారుల బృందం బుధవారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో పర్యటించింది. సీనియర్ మేనేజర్ వంశీ, అసిస్టెంట్ మేనేజరు అనుప్రియ, ఆఫీసర్ రాహుల్‌రెడ్డి నగరపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశమై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. లిక్విడ్, సాలిడ్ వేస్ట్(విజువల్) మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటుకు అనువైన స్థలాలను అధికారులతో కలిపి పరిశీలించి అనుకూలతలపై సర్వే నిర్వహించారు. రాష్ట్రంలో 93 మునిసిపాలిటీలు, నగరపంచాయతీలను వీటి ఏర్పాటుకు ఎంపిక చేయగా, అందులో గొల్లప్రోలు ఒకటి. ఇప్పటికే చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు తెలిపారు. అధికారుల వెంట గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనరు రవికుమార్, తహశీల్దారు సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దారు సౌజన్య ఉన్నారు.

భూ సమతుల్యత వైవిధ్యం కాపాడుకోవాలి

దివాన్‌చెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూ సమతుల్యత వైవిధ్యం కాపాడుకోవడం సమష్టి బాధ్యత అని సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకులు, ప్రచారకులు విజయరామ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని డీబీవీరాజు టౌన్‌షిప్‌లో గల శ్రీరాజేశ్వరీ కళ్యాణ మండపంలో భావితరాల కోసం గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయరామ్ మాట్లాడుతూ గ్రామీణ వికాసం కోసం ప్రస్తుతం మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారన్నారు. దీని వల్ల భూతాపం పెరిగిపోతోందని చెప్పారు. అందువల్ల భూతాపం తగ్గించడంతో బాటు భూసమతుల్యతను కాపాడేపనిని చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ఐదు అంచెల సాగువిధానం చేపట్టాలని చెప్పారు. ఇందులో అంతర్ పంటలు, దుంపలు, వంటివి ఉంటాయని ఒకసారి దున్నితే మళ్లీ భూమి దున్నవలసిన అవసరం ఉండదని చెప్పారు. అలాగే వెదురును సాగు చేసి చెంచాలు ప్లాస్టిక్ వస్తువులు స్థానే వెదురు చేసిన చెంచాలు వంటివివిధ వస్తువులు తయారు చేయవచ్చునన్నారు. ఈ విధంగా చేయడం, ఐదు అంచెలసాగు విధానం వల్ల ఎకరానికి వచ్చే ఆదాయం రూ.6 లక్షలకు పెరుగుతుందని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 24 వతేదీ వరకూ హైదరాబాద్ సమీపంలోని శాంతివనంలో పదివేలమంది రైతులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీజాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి కేంద్రబడ్జెట్‌లో రూ.2800 కోట్లు మంజూరుకు కేబినెట్ ఆమోదం కుడా లభించిందన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పుకు అనుగుణంగా వ్యవసాయ విధానంపై సదస్సు నిర్వాహకుడు అంబటిశివప్రసాద్ ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయరామ్

మెగా పేరెంట్ మీటింగ్‌ని వాయిదా వేయాలి

యూటీఎఫ్ వినతి



తూర్పుగోదావరి డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డిసెంబరు 7న నిర్వహించాలని నిర్ణయించిన మెగా పేరెంట్ మీటింగ్‌ని వాయిదా వేయాలని తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ నాయకత్వం కోరింది. ఈ మేరకు అధ్యక్ష, కార్యదర్శులు జయకర్, షరీఫ్ డీఈవో కె.వాసుదేవరావుకు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఆ రోజున సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని గోదావరి జిల్లాల్లో ఘనంగా జరుపుకుంటారని, అందువల్ల ఆ రోజున జిల్లాలోని పాఠశాలలకు లోకల్ హాలిడే ఇవ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. ఒకవేళ పాఠశాల నిర్వహించినా విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉంటుందన్నారు. పైగా ఎన్నికల కోడ్ 10వ తేదీ వరకూ అమలులో ఉంటుందన్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని ఏలూరు, పశ్చిమ, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని 10వ తేదీ తర్వాత నిర్వహించాలని వారు అభ్యర్థించారు.

ఒకే కుటుంబానికి చెందిన...

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

హోటల్ ప్రారంభించి నష్టాలు రావడంతో పురుగుల మందు తాగిన బాధితులు



రాజమహేంద్రవరంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సంచనం రేపింది. ప్రకాశ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికానగర్‌లో సాయిశుభా అపార్ట్‌మెంట్ ఎస్3 ఫ్లాట్‌లో పాతూరి ఉపేంద్రకుమార్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. కొద్ది నెలల క్రితం ఎస్‌వీ రెస్టారెంట్ పేరుతో అదే ప్రాంతంలో ఓ హోటల్ ప్రారంభించారు. పెట్టుబడి, నిర్వహణ కోసం సుమారు రూ.40లక్షలు అప్పు చేశారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో.. అప్పులు తీర్చ లేమనే మనస్తాపం చెందారు. దీంతో కుటుంబ యజమాని పాతూరు ఉపేంద్ర కుమార్, భార్య లక్ష్మీవిజయ, కుమారుడు సంతోశ్ బుధవారం ఉదయం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు తాగామని బాధితులు చెబుతున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాళ్లను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదం తప్పిందని, సురక్షితంగా ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అయితే ఆత్మహత్యాయత్నం కావడంతో ఎలాంటి పోలీసు కేసూ నమోదు కాలేదు.

మీ చేతిలోనే.. మీ సేవ

- ఇక నిమిషాల్లో ఈసీ, సీసీ
- మీ సేవల ద్వారా సేవలు యథాతథం
- మధ్యవర్తుల ప్రమేయానికి చెక్
- గేట్ వేను అభివృద్ధి చేసిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



పెద్దాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అందిస్తున్న పలు రకాల సేవలు ఇక మరింత సులభతరమయ్యాయి. ఇప్పుడు ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), సర్టిఫైడ్ కాపీ (సీసీ)ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. సగటు పౌరుడు సైతం నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆన్‌లైన్ విధానంలో అవసర మైన రుసుము, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు చెల్లిస్తే క్షణాల వ్యవధిలో ఆయా సేవలు పొంద వచ్చు. ప్రస్తుత ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమే యం ఉండబోదని అధికారులు చెబుతున్నారు. మీసేవా కేంద్రాల్లో ఈసేవలు అందుబాటలో లేవని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కూడా..

ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేని గ్రామీ ణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాల ద్వారా ఆయా కాపీలను అందుకోవచ్చు. దానికి ఎలాంటి పరి మితులు లేవు. గతంలో వీటికోసం మీసేవలో దరఖాస్తు చేశాక, అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ తగిన అనుమతులు పొందిన తరువాత మీసేవలో మాత్రమే డాక్యుమెంట్లను పొందగలిగేవారు. ఫలితంగా మితిమీరిన కాలయాపన జరిగేది. దరఖా స్తుదారు రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చే ది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా తక్కువ సమ యంలో డాక్యుమెంట్లు ప్రజలకు చేరనున్నాయి. గతంలో దరఖాస్తుదారు చెల్లించిన రుసుము మీసేవ విభాగానికి జమయ్యేవి. ఇప్పుడు నేరుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చేరనున్నాయి.

ఆన్‌లైన్ విధానంతో సత్ఫలితాలు..

గతంలో ఈసేవల పొందేందుకు ప్రతీ ఒక్కరూ మీసేవా కేంద్రానికి వెళ్లవలసి వచ్చేది. కొత్త ప్రభుత్వం ఈ శ్రమను సైతం తగ్గించా లని నిర్ణయించింది. ఫలితంగా అందుబాటు లోకి వచ్చిన ఆన్‌లైన్ విధానం సత్ఫలితాలను ఇస్తోంది. నిర్ణీత దరఖాస్తు నింపి దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లేదా మీసేవా తీసకెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇందుకోసం స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ తన వెబ్‌సైట్ ద్వారా చెల్లింపు గేట్‌వేను అభివృద్ధి పరిచింది. ఇది మంచి ఫలితాలను ఇవ్వడంతో ఈసీ,సీసీ కాపీలను తక్షణమే పొందగలిగే వెసులుబాటు లభించింది.

నౌకలన్నీ బంద్..

- -కాకినాడ పోర్టులో ఒకటో నెంబర్ తుఫాను హెచ్చరిక జారీ
- -ఈనెల 30వరకు సముద్రంలో ఎక్కడి షిప్పులు అక్కడే..
- -ప్రస్తుతం కాకినాడకు బియ్యం, ఇతర కార్గో కోసం పది నౌకలు రాక
- -వీటిలో 8 నౌకల్లోకి సరుకు లోడింగ్ నిలిపివేత
- -సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బార్జీల రాకపోకలకూ రెడ్‌సిగ్నల్



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

నైరుతి బంగాళాఖాతంలో 'ఫెంగల్' తుఫాను హెచ్చరిక నేపథ్యంలో ఆ ప్రభావం కాకినాడ జిల్లాపైనా పడనున్నట్టు వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కాకినాడ పోర్టుకు ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ అయింది. దీంతో కాకినాడ పోర్టులో ఈనెల 30వరకు ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలను నిలిపివేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండం తుఫానుగా మరికొన్ని గంటల్లో మారనుండడంతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. బలమైన ఈదురుగాలులతో బలంగా కెరటాలు ఎగసిపడుతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ నౌకల్లోకి కార్గో లోడింగ్‌ను నిలిపివేస్తూ పోర్టు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కాకినాడ పోర్టుకు బియ్యంతోపాటు ఇతర కార్గో లోడింగ్, అన్‌లోడింగ్ కోసం పది నౌకలు వచ్చాయి. వీటిలో 2హోప్ ఐలాండ్‌కు సమీపంలో ఉన్నాయి. హోప్‌ఐలాండ్ వల్ల కొంత గాలుల తీవ్రత తక్కువగా ఉండడంతో వీటికి బుధవారం వరకు లోడింగ్ జరిగింది. మిగిలిన 8 నౌకలు దూరంగా ఉండడంతో వీటిని అక్కడే నిలిపివేయాలని ఆదేశాలిచ్చారు. ఈనెల 30 వరకు సముద్రంలోనే లంగరు వేయాలని సూచించారు. నౌకలకు కార్గోను తరలించే బార్జీల రాకపోకలను సైతం ఈనెల 30వరకు నిలిపివేశారు. మరోపక్క తుఫాను ప్రభావంతో ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. పెద్దఎత్తున అలలు బీచ్‌రోడ్డును తాకుతున్నాయి.

నిరంతర కృషితో పోటీ పరీక్షల్లో గెలుపు

- తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్
- సివిల్స్ ఉచిత శిక్షణ స్ర్కీనింగ్ పరీక్షకు 70 మంది హాజరు



సివిల్స్ స్ర్కీనింగ్ పరీక్ష ఓఎంఆర్ షీట్‌ను కలెక్టర్ ప్రశాంతికి అందజేస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన, కృషితోనే పోటీ పరీక్షల్లో గెలుపు సాధ్యమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అభ్యర్థులకు స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష ప్రశ్నాపత్రం, ఓఎంఆర్ షీట్లను బీసీ వెల్ఫేర్ అధికారులతో కలసి కలెక్టర్ ఓపెన్ చేశారు. అనంతరం పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి మొత్తం 75 దరఖాస్తులు వచ్చాయని, స్ర్కీనింగ్ పరీక్షకు 70 మంది హాజరయ్యారని అన్నారు. ఉత్తీర్ణులైన వారికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో ఆరు నెలలపాటు ఉచితంగా శిక్షణ, స్టయిఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సివిల్స్ కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు పట్టుదలతో ప్రయత్నించి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్ర్కీనింగ్ పరీక్షల నిర్వహణను ఆర్డీవో కృష్ణనాయక్, బీసీ వెల్ఫేర్ అధికారిణి కేఎస్ జ్యోతి, సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్, ఇతర అధికారులు పరిశీలించారు.

పింఛన్‌దారుడు మరణిస్తే..నెల రోజుల్లోనే భార్యకు పింఛన్

కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయం

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్ దారులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ముందుగా ఇచ్చిన హామీ మేరకు నెలకు పింఛను రూ.4వేలకు పెంచారు. 3నెలలకు అదనంగా రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలను పింఛన్‌గా అందజేశారు. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం మరో ప్రకటన విడుదల చేసింది. పింఛనుదారుడు మృతి చెందితే నెలరోజుల్లోనే అతడి భార్యకు వితంతు పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపింది. దీంతో పింఛన్ తీసుకుంటూ ఏ వ్యక్తి అయినా మృతిచెందినా మరణానంతరం భార్య జీవనానికి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఆమెకు వితంతు పింఛను అందేలా తీసుకున్న ప్రభుత్వం నిర్ణయంపై డీఆర్‌డీఏ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సారథ్యంలో ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాలు ఇవే....

ఎన్టీఆర్ భరోసా పింఛనుదారుడు మరణిస్తే భార్యకు వెంటనే ప్రభుత్వం వితంతు పింఛను మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెన్షన్‌దారుడు నవంబరు 1 తర్వాత మరణిస్తే మరణ ధ్రువీకరణ పత్రాన్ని పింఛన్‌దారుడి భార్య నవంబరు 15లోపు, గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేస్తే ఆమోదం పొందిన తరువాత డిసెంబరు 1 నుంచి వితంతు పింఛన్ మంజూరు చేస్తారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలో వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి 1,38,249మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా ఇప్పటికే రూ.41,47,47,000 నగదును పంపిణీ చేస్తున్నారు. ఒకవేళ నవంబరు 15 తర్వాత అందజేస్తే 2025, జనవరి 1 నుంచి వితంతు పింఛన్ మంజూరు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీరపాండ్యన్ జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా కార్యాలయాలకు అందాయి.

కోటి దీపోత్సవం

కార్తీక మాసం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి గట్టున గల సరస్వతీఘాట్ వద్ద బుధవారం సాయంత్రం కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించారు.

- రాజమహేంద్రవరం కల్చరల్







సరస్వతీఘాట్ వద్ద మెట్లపై వెలిగించిన దీపాలు, శివలింగానికి అలంకరణ దృశ్యాలు

స్కూటీని ఢీకొన్న బస్సు

ఇంటర్ విద్యార్థిని మృతి



మృతిచెందిన రూపాదేవి

కడియం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన విద్యార్థిని మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేమగిరితోటకు చెందిన పితాని రూపాదేవి (17) రాజమహేంద్రవరంలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. రూపాదేవి మేనత్త కల్లా దుర్గ కూడా డిగ్రీ పరీక్షలు రాసేందుకు రాజమహేంద్రవరం వెళ్తుంది. ఈ నేపథ్యంలో కల్లా దుర్గ, పితాని రూపాదేవి ఇద్దరూ స్కూటీపై బయలుదేరారు. వేమగిరితోట నుంచి రాజమహేంద్రవరం వెళ్తూ సెంటర్ వద్ద వారి స్కూటీని రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న ఆదిత్య కళాశాల బస్సు ఢీకొంది. దీంతో స్కూటీతో సహా ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. స్కూటీ వెనుక కూర్చున్న రూపాదేవి మీద నుంచి బస్సు చక్రాలు వెళ్లిపోయింది. గాయాలపాలైన ఇద్దరిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దుర్గకు గాయాలవ్వగా, రూపాదేవి చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

చాకుతో దాడి



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జయలక్ష్మి

ఎటపాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం తెల్లవారుజామున అల్లూరి జిల్లా ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ ఎర్రబోరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రబోరు గ్రామానికి చెందిన బొగ్గా జయలక్ష్మీకి బొగ్గా రామకృష్ణతో పదకొండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే 8 నెలలుగా భార్యభర్తలు విడిపోయి దూరంగా ఉంటున్నారు. జయలక్ష్మి పుట్టిళ్లు అయిన ఎర్రబోరు గ్రామంలో ఉంటుంది. ఈక్రమంలో రామకృష్ణ బుధవారం తెల్లవారుజామున భార్య ఇంటికి వచ్చి గొడవపడి చాకుతో భార్య కాళ్లపై దాడి చేశాడు. జయలక్ష్మి కేకలు వేయడంతో అక్కడ నుంచి రామకృష్ణ పరారైయ్యాడు. వెంటనే జయలక్ష్మిని గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు. గాయం కారణంగా 4కుట్లు వేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిక జీతం ఆశ చూపి మోసం

గల్ఫ్ ఏజెంట్లపై కేసు నమోదు

రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధిక జీతం ఆశచూపి మస్కట్ పంపి తన సోదరిని ఇద్దరు ఏజెంట్లు మోసగించారంటూ బాధితురాలి తమ్ముడు యంద్ర శివగణేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్‌ఐ బుజ్జిబాబు బుధవారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన మేకా గంగా భవానికి మస్కట్‌లో అధిక జీతం వస్తుందని నమ్మించి గండి జయసుధ, సాదే నరేంద్ర అనే ఇద్దరు గల్ఫ్ పంపారు. గల్ఫ్‌లో గంగాభవాని ఆరోగ్యం బాగోలేకపోవడంతో ప్రస్తుతం స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఏజెంట్లకు కొంతమొత్తం ఇచ్చినా ఇండియాకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయకుండా వారు మోసగించినట్టు బాధితురాలి సోదరుడు శివగణేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నేడు సత్యదేవుడి సన్నిధికి భారతీ స్వామి రాక

అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి గురువారం శృంగేరీ పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి విచ్చేయనున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామీజీ సాయంత్రం 5గంటలకు సత్యదేవుని దర్శించి తిరిగి రాజమహేంద్రవరం పయనమవుతారని వారు చెప్పారు.

భలే ఉంది..బుల్లి దూడ

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో పుంగనూరు రైతు రెడ్డి సత్తిబాబుకు చెందిన పుంగనూరు ఆవుకు కేవలం 12 అంగుళాల ఎత్తులో పెయ్యి బుల్లి దూడ జన్మించింది. సాధారణంగా పుంగనూరు దూడలు 15నుంచి 18అంగుళాలు ఎత్తు ఉంటాయి. ఇంత తక్కువ ఎత్తులో పుట్టడం అరుదుగా జరుగుతుంటాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. పుంగనూరు దూడను రైతులు, పశుప్రేమికులు ఆసక్తి తిలకిస్తున్నారు.



గణితంపై అవగాహన

మలికిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): లక్కవరం బాలికల కళాశాలలో గణితంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మలికిపురం డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కేవీ ఆనంద్ మాట్లాడారు. గణితంలో ఉన్న మెలకువలను విద్యార్థులకు వివరించారు. గణిత పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

పొలం పిలుస్తోంది

అంతర్వేది, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామేశ్వరం, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు వివరిస్తూ వ్యవసాయశాఖ, అనుబంధ రంగాలపై రైతులకు అవగాహన కల్పించారు.

శిథిలస్థితిలో పోలీసు క్వార్టర్లు

- 1994లో పోలీసు క్వార్టర్ల నిర్మాణం
- 2021శిథిలస్థితి, క్వార్టర్ల ఖాళీ
- కొత్త క్వార్టర్లు నిర్మించాలని వినతి



శిథిలస్థితికి చేరుకున్న పోలీసు క్వార్టర్లు

రాజోలు, నవంబరు 26: గ్రామాల్లో ఎటువంటి వివాదాలు తలెత్తినా వెంటనే అక్కడకు వెళ్లి ప్రజలకు రక్షణగా ఉండే రక్షక భటుల నివాసాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. రాజోలులో పోలీసు సర్కిల్ కార్యాలయం సమీపంలో 32మంది కానిస్టేబుళ్లు నివాసం ఉండేలా నాలుగు బ్లాకులుగా పోలీసు క్వార్టర్లను 1994లో నిర్మించారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొద్దిపాటి వర్షానికే క్వార్టర్లలోని ఆవరణ అంతా ముంపు బారిన పడుతుంది. వర్షం వస్తే భవనంలో శ్లాబ్ నుంచి వర్షపు నీరు లీకవుతుంది. గుమ్మాలు, కిటికీలకు ఏర్పాటు చేసిన తలుపులు పూర్తిగా ఊడిపోయాయి. విద్యుత్ వైరింగ్ చాలా అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ పాడవ్వడంతో వాడకం నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో దుర్గంధ పరిస్థితి నెలకొంది. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉండేది. ఇవన్నీ భరించ లేక 32కుటుంబాలకు 2015వ సంవత్సరం వరకు ఏడు కుటుంబాలు వారు మాత్రమే క్వార్టర్లలో నివాసం ఉండేవారు. ఈ సమస్యలన్నీ మరింత ఎక్కువవ్వడం, క్వార్టర్లు పూర్తిగా శిథిలస్థితికి చేరడంతో ఆ ఏడు కుటుంబాలు కూడా 2021లో క్వార్టర్ల నుంచి పూర్తిగా ఖాళీ చేశారు. అప్పటి నుంచి పోలీసు క్వార్టర్ల ఆవరణ అంతా పెద్దపెద్ద పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిపోయింది. పోలీసు క్వార్టర్లు శిథిలస్థితికి చేరడంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని పోలీసు కుటుంబాలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

తుపాను ప్రభావం.. రైతుల ఆందోళన

అల్లవరం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈనెల 29నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, చేలలో నిలబడి ఉన్న వరి దుబ్బులను రైతులు కోయవద్దని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు రైతులకు సూచించారు. కోడూరుపాడులో వరిచేలను, ధాన్యం రాశులను పరిశీలించి సూచనలు చేశారు. గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది రైతులను అప్రమత్తం చేయాలన్నారు. అల్లవరం మండలంలో 172ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయన్నారు. ఏవో ఎస్వీవీ సత్యనారాయణ, ఏఈవో ఎం.శుభగణేష్, బి.శ్రావణి, రైతులు కొక్కిరమెట్టి తాతాజీ, సూరిబాబు, పిల్లా సూర్యనారాయణ, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు. తుఫాన్ భారీ వర్షాల నేపథ్యంలో వరి రైతులను ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు అప్రమత్తం చేయాలని ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ సూచించారు. ఏపీవో వి.శ్రీనుబాబు, అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అల్లవరం: కోడూరుపాడులో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి

మామిడికుదురు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వ్యవసాయాధికారి పి.మృదుల వివరించారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం, వరిని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని, కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలను వర్షాల ముందు కోయరాదన్నారు. కోత కోసి పొలంలో పనలు ఉన్నట్టయితే గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలన్నారు.

వరి కోతలు నిలిపివేయాలి

అయినవిల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఈనెల28నుంచి డిసెంబరు 2వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ఐదు రోజులు వరి కోతలు నిలిపివేయాలని తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ విజ్ఞప్తి చేశారు. కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైతే మిల్లులకు చేర్చేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని వారికి కేటాయించిన మిల్లులకు పంపిస్తామన్నారు. అయినవిల్లిలో రైతులకు 24గంటలు అందుబాటులో ఉండేందుకు కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు.

పంట ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

అంబాజీపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రైతుల గుండెల్లో ఆందోళన నెలకొంది. వాతావరణమార్పులు రావడంతో అన్నదాతలు హడావిడిగా నూర్పులు చేస్తున్నారు. ఎండ బెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. డిసెంబరు 2వరకు రైతులు కోతలు వాయిదా వేసు కోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ సూచించారు. పసుపల్లిలోని రైస్‌మిల్లు వద్ద నియమించిన కస్టోడియల్ అధికారులు గోనె సంచులను, రవాణాచార్జీలు, హమాలీలను కల్పిస్తారన్నారు.

కంట్రోల్ రుమ్ ఏర్పాటు

పి.గన్నవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రుమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ఏవిధమైన ఇబ్బందులు ఉన్నప్పటికి కంట్రోల్‌రూమ్ (నెంబరు 9010143248)కు సమాచారం అందించాలన్నారు. తుఫాన్ కారణంగా వారం రోజులు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు.

తుఫాన్‌తో జాగ్రత్తలు పడాలి

ముమ్మిడివరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావం కోనసీమ జిల్లాపై ప్రభావం చూపి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మీ తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని ఆమె సూచించారు. రైతులు వరి కోతలను డిసెంబరు 1వరకు వాయిదా వేసుకోవాలన్నారు.

బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలి : డీఈవో



అమలాపురం: మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

అమలాపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు అందరూ సమష్టిగా కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. బాలికా విద్య సమాజ అభ్యున్నతికి తోడ్పడుతుందన్నారు. దేశ ప్రగతిలో ప్రధాన పాత్ర పోషించాల్సిన బాధ్యత విద్యార్థినులకు ఉందని చెప్పారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సహకారంతో బుధవారం అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో బాల్య వివాహ ముక్తభారత్ క్యాంపెయిన్‌లో భాగంగా హెచ్ఎం వి.విజయకుమారి అధ్యక్షతన విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహ ముక్తభారత్‌లో భాగంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ ఎంఎకే భీమారావు, జిల్లా ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, సీడీపీవో డి.విజయశ్రీ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఉమాలక్ష్మి, సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, మండల లీగల్‌సెల్ అడ్వకేట్ కేవీవీ శ్రీనివాసరావు వివిధ అంశాలపై ప్రసంగించారు.

బాల్య వివాహాలు జరిపిస్తే శిక్షార్హులు

ముమ్మిడివరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరిపించినా, వాటిని ప్రోత్సహించిన వారు శిక్షార్హులని ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం సీహెచ్ పరిమళ, పోలీసులు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.11.16లక్షల పోస్టల్ బీమా చెక్కు అందజేత

అమలాపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన పులగుర్త శరత్‌సుధాకర్ (50) రూ.10లక్షల గ్రామీణ తపాలా పాలసీ తీసుకున్నారు. క్రమం తప్పకుండా 2నెలలకు గాను రూ.61వేలు ప్రీమియంగా చెల్లించారు. గత ఏడాది శరత్‌సుధాకర్ గుండెపోటుతో మరణించారు. నామినీగా ఉన్న భార్య, ఇద్దరు కుమార్తెలకు బుధవారం అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ రూ.11,16,390 బీమా చెక్కును అందజేశారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్‌తో ప్రతీ కుటుంబానికి తపాలా బీమా రక్షణగా నిలుస్తుందన్నారు. 19 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారందరూ పోస్టల్ బీమా చేయవచ్చునన్నారు. రూ.50ప్రీమియంతో కూడా పాలసీ పొందవచ్చునని నవీన్ కుమార్ తెలిపారు.

కరాటే పోటీల్లో శ్రీవేద విద్యార్థి ప్రతిభ

యానాం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో నిర్వహించిన 24వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్ షిప్‌లో యానాం శ్రీవేద పబ్లిక్ స్కూల్ విద్యార్థి కర్రి జశ్వీర్ ప్రతిభ చూపి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల చైర్మన్ గుత్తుల గోవింద జయరామారావు, డైరెక్టర్ నీతూ అర్జున్ తెలిపారు. ఇటీవల జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పాఠశాల స్థాయిలో విద్యార్థి కాళ్ల భానుతేజ మొదటి బహుమతిని గెలుచుకున్నాడు. జశ్వీర్, భానుతేజను పాఠశాల ప్రతినిధులు అభినందించారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

పి.గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మొండెపులంకలో ఆరుమిల్లి వీరభద్రం, ఆయన తనయులు ఆధ్వర్యంలో భారీ కార్తీక వనసమారాధన జరిగింది. తొలుత స్థానిక మహిళలు, అయ్యప్ప స్వాములు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, ఆరుమల్లి పెదబాబు, నాగబాబు, లాల్‌బాబు, సాయిబాబు, రాంబాబు, అడబాల తాతకాపు, సంసాని పెద్దిరాజు, వేమన మల్లేశ్వరావు, నల్లా పెద్దకాపు, మహిళలు పాల్గొన్నారు.

చేలల్లో పనలు, కళ్లాల్లో ధాన్యం



సన్నవిల్లిలో మాసూలు చేసిన ధాన్యాన్ని తరలిస్తున్న రైతు

ఉప్పలగుప్తం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ భయంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. సార్వా పంట గట్టుకు వచ్చే వేళ మళ్లీ తుఫాన్ భయపెడుతోంది. తహసీల్దార్ వాసా దివాకర్, వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు కోతలు పూర్తయిన పొలాలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించి రైతులను అప్రమత్తం చేస్తున్నారు. మండలంలో 4,481ఎకరాలకు గాను ఇప్పటికి 1,213ఎకరాల్లో కోతలు జరిగాయి. కోసిన పంట వివిధ దశల్లో ఉంది. పొలాల్లో పనలను సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా అధికారులు సహకరిస్తున్నారు. కళ్లాల్లో ఉన్న తడి ధాన్యాన్ని బాయిలర్ మిల్లులకు పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం అమ్ముకునేందుకు తమ కార్యాలయానికి ఫోన్ చేస్తే ఏర్పాట్లు చేస్తామని తహసీల్దార్ బుధవారం గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ద్వారా రైతులకు సమాచారమందించారు. తమ కార్యాలయంలో 8008803200 లేదా వ్యవసాయాధికారి కార్యాలయంలో 8331056518 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు.

ఆలయంలో కాయిన్ నిలబడితే కోరిక తీరినట్టే

అంతర్వేది, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కోరిన కోర్కెలు తీర్చే స్వామివారిని ప్రతీ ఇంటా ఇలవేల్పుగా భావిస్తారు. ఆలయంలో భక్తులు స్వామివారి ధ్వజస్తంభం వద్దనున్న బలిహరణ పీఠం మీద రూపాయి, రూ.5నాణేలను నిలబెట్టి కోర్కెలు కోరుకుంటున్నారు. కాయిన్ నిలబడితే కోర్కెలు తీరుతున్నాయంటూ భక్తుల నమ్మకం. బలిహరణ పీఠం మీద నాణేలను నిలబెట్టేందుకు అధిక సంఖ్యలో భక్తులు క్యూ కడుతున్నారు. తొమ్మిది బుధవారాలు తొమ్మిది ప్రదక్షిణలు చేసిన భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం నాణేలను నిలబెట్టేందుకు బలిహరణ పీఠం వద్ద గుమిగూడారు.

మహానుభావుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలి



జ్యోతిరావుపూలే, దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను ప్రారంభించిన మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజోతి): మహానుభావుల సేవలను యువత ఆదర్శంగా తీసుకుని ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. నరేంద్రపురం ప్రధాన సెంటర్‌లో శ్రీలక్ష్మీగణపతి శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, దొమ్మేటి వెంకటరమణ విగ్రహాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావుపూలే అయితే అన్నిసామాజిక వర్గాలు కలిసి ఉండా లని కోరుకుంటూ జాతి కోసం పోరాడిన మరో మహానుభావుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని అన్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ జ్యోతిరావుపూలే, వెంకటరెడ్డిలు కలలు గన్న సమాజాన్ని స్థాపించాలన్నారు. తొలుత స్థానిక గ్రామదేవత ఆలయంలో మంత్రి సుభాష్ పూజలు చేశారు. అనంతరం కార్తీక వనసమారాధనలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, సర్పంచ్ బీర వెంగమాంబ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, శాసనమండలీ మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రముఖ శిల్పి వడయార్, ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి, బొంతు పెదబాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, చొల్లంగి సత్తిబాబు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, గుత్తుల చంటి, పత్తిన వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

అయినవిల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాటామంతీ నిర్వహించారు. వారి విద్యా ప్రగతిపై సమీక్షించారు. వంద రోజుల ప్రణాళికను అమలు పరిచి మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాస్, సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆర్.భాస్కరరావు, వై.ఫణి కుమార్, జి.సాయిశ్రీనివాస్, సౌదామిని, ఆర్. వెంకట్రావు పాల్గొన్నారు.

కోదండరామునికి పూజలు

అల్లవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యెంట్రుకోన కాలువగట్టు శెట్టిబలిజ కోదండ రామాలయం వార్షికోత్సవం సందర్భంగా సంబరాలు, పూజలు చేశారు. గ్రామ వీధుల్లో కోదండరాముని ఉత్సవ విగ్రహాలతో ఘనంగా పల్లకి ఊరేగింపు జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజనలు, పూజలు జరిగాయి.

దెందుకూరిని కలిసిన కూటమి నేతలు

అల్లవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజును జనసేన టీడీపీ కూటమి నాయకులు అభినందించారు. జనసేన నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, టీడీపీ నాయకులు పోతుల నాగరాజు, వీరారాజా, అడబాల రాజేష్, గునిశెట్టి రాజేష్, కె.అనంతరావు, గోడి సచివాలయ ఉద్యోగులు దెందుకూరిని కలిసి అభినందించారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడా పోటీలకు ఆహ్వానం

అమలాపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 30, డిసెంబరు 1న రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడా పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్ కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడం గ్రామంలోని గుడ్‌రోల్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఎంపికలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని సైక్లింగ్ క్రీడాకారులు ఎక్విప్‌మెంట్‌తో సహా పోటీలకు హాజరు కావాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన సైక్లింగ్ క్రీడాకారులను డిసెంబరు 7నుంచి 10వరకు ఒడిసా రాష్ట్రంలోని పూరీలో నిర్వహించే 29వ జాతీయ సైక్లింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాల కోసం గుంటూరుకు డీఎస్ఏకు చెందిన సైక్లింగ్ కోచ్ వి.వెంకటరావు, సెల్ 9849379932, అథ్లెటిక్స్ కోచ్ ఎస్.శివారెడ్డి, సెల్ 9703092077ను సంప్రదించాలన్నారు.

యాంటీ బయాటిక్స్‌పై అవగాహన

యానాం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యాంటీ బయాటిక్స్ అవగాహన వారోత్సవంలో భాగంగా యానాం ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో యాంటీ బయాటిక్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమం యానాం వైద్యశాఖాధికారి డాక్టర్ టి.రవిశంకర్ ఆధ్వర్యంలో జరిగింది. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీణ్ యాంటీ బయాటిక్స్ గురించి వివరించారు.

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం కార్యవర్గం ఎన్నిక



అమలాపురంటౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తెలుగు నాడు విద్యుత్ కార్మికసంఘం (టీఎన్‌టీయూసీ) సర్వసభ్య సమావేశం బుధవారం అమలాపురం వాసర్ల గార్డెన్‌లో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడు గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఐదు జిల్లాల కార్యదర్శి బి.రవీంద్ర, కార్యదర్శి ఆర్.సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 32యూనియన్(ఐఎన్‌టీయూసీ) నుంచి 50మంది సభ్యులు తెలుగునాడు కార్మిక సంఘంలో చేరారు. తెలుగునాడు విద్యుత్ కార్మికసంఘం రీజనల్ కార్యవర్గాన్ని సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రీజనల్ కార్యదర్శి భారతి వెంకటేశ్వరరావు, అధ్యక్షునిగా గణేష్‌లతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా దేవదాసు రమేష్, కుడుపూడి బాలాజీ, బడుగు రాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలోడివిజన్ సంఘం అధ్యక్షుడు సీహెచ్ గిరిధర్, కార్యదర్శి వి.మోహన్‌బాబు పాల్గొన్నారు.

కుండలేశ్వరంలో భక్తుల పూజలు

కాట్రేనికోన, నవంబరు27(ఆంధ్రజ్యోతి):బుధవారం అధికసంఖ్యలో భక్తులు కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాశ్శకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో చెయ్యేరుకు చెందిన బసవా లక్ష్మణరావు, అడపా శ్రీను, ఉంగరాల సత్యనారాయణ, చేగొండి రామకృష్ణభాస్కరరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో 3000మంది భోజనాలు చేశారు. ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈవో ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.

టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకోవాలి

రాజోలు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయించుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ అడబాల చంటి కోరారు. ఈసందర్భంగా కాట్రేనిపాడులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రూ.100టీడీపీ సభ్యత్వ నమోదు చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి గతంలో రూ.2లక్షలుగా ఉన్న ప్రమాద బీమా సదుపాయాన్ని రూ.5లక్షలకు పెంచారని చంటి అన్నారు. ముత్యాల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

అంతర్వేది/మలికిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయిగుండం కారణంగా సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో తీరప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఆయా మండలాల తహశీల్దార్లు, మత్స్యశాఖ అధికారులు తెలిపారు. మలికిపురంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24గంటలు రైతులకు అందుబాటులో సేవలు కొనసాగుతాయని తహశీల్దార్ తెలిపారు. కంట్రోల్ రూము నంబరు 9866960915కు సహాయం కోసం సంప్రదించాలని మలికిపురం తహశీల్దార్ కోరారు.

24గంటల్లోపు నగదు జమ అభినందనీయం

మామిడికుదురు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లోపు సొమ్ములు జమ చేయడం అభినందనీయమని రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విధానంలో తీసుకువచ్చిన మార్పులపై మామిడికుదురులో టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రైతు అభీష్టం మేరకు అందుబాటులో ఉన్న మిల్లరుకు ధాన్యం అమ్ముకోవడంతో పాటు సత్వరమే ధాన్యం తరలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కడలి కృష్ణమోహన్, అప్పారి వెంకటేశ్వరరావు, సాపే ఏకాదశి, పెచ్చట్టి విజయభాస్కరరావు, యింటి గణపతి తదితరులు పాల్గొన్నారు.


అగ్నికుల క్షత్రియ చైర్మన్ పాపారావుకు అభినందనలు

అమలాపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చిలకలపూడి పాపారావును బుధవారం విజయవాడలోని ఆయన కార్యాలయం వద్ద జిల్లాకు చెందిన సర్పంచ్‌లు కలిసి ఘనంగా సత్కరించారు. చైర్మన్‌గా నియమితులైన పాపారావు బాపట్ల జిల్లా రేపల్లె మండం మాలంకివాని సర్పంచ్‌గా పనిచేయడంతో పాటు సర్పంచ్‌ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారని సర్పంచ్ పెనుమాల సునీత తెలిపారు. సత్కరించిన వారిలో కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పెనుమాల ఏడుకొండలు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

ఉప్పలగుప్తం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు కొండంత అండగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె.వెంకట్రావు చెప్పారు. పెదగాడవిల్లిలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన రైతులకు వివరించారు. చలికాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి పాడి పశువులను ఎలా రక్షించుకోవాలన్న అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ సీహెచ్ గోపాలకృష్ణ, మండల పశువైద్యాధికారులు ఎం.నిరోషా, ఆకుల రమేష్, టీఎం యామిని, పి.సుధీర్, జూనియర్ పశువైద్యాధికారులు కేవీ రామారావు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సంఘ కార్యదర్శిగా వెంకటేశ్వరరావు



ఉప్పలగుప్తం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రీజనల్ కార్యదర్శిగా భారతి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. బుధవారం అమలాపురంలో జరిగిన సమావేశంలో ఈఎన్నిక జరిగింది. వెంకటేశ్వరరావు ప్రస్తుతం ఉప్పలగుప్తంలో ట్రాన్స్‌కో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వివిధ మండలాల విద్యుత్ కార్మికులు ఆయనను కలిసి అభినందించారు.

ఎమ్మెల్యే గిడ్డికి సత్కారం

అయినవిల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల సభ్యునిగా నియమితులైన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను టీడీపీ నాయకుల బృందం బుధవారం కలిసి ఘనంగా సత్కరించారు. జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు కృషిచేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, మానవ వనరుల అభివృద్ధి కమిటీ సభ్యుడు నేదునూరి వీర్రాజు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నం బాలవిజయరావు విజ్ఞప్తి చేశారు. సత్కరించిన వారిలో సర్పంచ్ జల్లి బాలరాజు, గుమ్మళ్ల శ్రీనివాససాగర్, మోర్త వీరవెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం



స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బహుళ శుద్ధ ద్వాదశి పర్వదినాన బుధవారం స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ పురాతన కల్యాణ మండపంలో స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి అలంకరించారు. అర్చకులు స్వామి-అమ్మవార్ల కల్యాణ తంతు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవంలో భాగంగా స్వామి-అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకుని స్వామివారి నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారు.

ఫ్రిజ్‌లో శివలింగం



ముమ్మిడివరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చినకొత్తలంకలో డీప్ ఫ్రిజ్‌లో శివలింగం ఆకారంలో మంచు లింగం ఏర్పడి పలువురిని విశేషంగా ఆకర్షించింది. గ్రామానికి చెందిన పత్సమట్ల సుబ్బహ్మణ్యరాజు-సీతామహలక్ష్మి గృహంలో డీప్ ఫ్రిజ్‌లో అమరనాథ్ శివలింగం రూపంలో మంచులింగం ఏర్పడింది. ఈశివలింగాన్ని చూసిన భక్తులు భక్తి పారవశ్యంతో దర్శనం చేసుకుంటున్నారు. కార్తీకమాసం కావడంతో మంచు శివలింగం విశేషంగా ఆకర్షిస్తుంది.

ఏకాదశ రుద్రుల దర్శనానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగుస్తుండటంతో ఏకాదశ రుద్రుల దర్శనానికి దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తులు ఒకేరోజు 11రుద్రులను దర్శించుకునేందుకు బారులు తీరుతున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు బస్సులు, కార్లు, మోటార్‌సైకిళ్లపై వస్తున్నారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు ప్రసాదాలను అందిస్తున్నారు.

టీడీపీతోనే ప్రతి ఒక్క కుటుంబానికి భరోసా

అంబాజీపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రతి కుటుంబానికి భరోసా దొరుకుతుందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు అన్నారు. మాచవరంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ గణపతి వీరరాఘవులు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, నాయకులు నాగాబత్తుల వెంకటసుబ్బారావు, రవణం రాము, దొమ్మేటి శ్యామ్, కత్తుల బాబులు, యాగన రాము, కొప్పిసెట్టి ఈశ్వరరావు, మందా రాజేష్, కాసా నాగమల్లేశ్వరరావు, యాగన వంశీ, దొమ్మేటి రామారావు, పళ్ళ శ్రీను, అధికారపు శ్రీనివాస్, గుబ్బల నాగ వెంకటరమణ, మట్టపర్తి భారతి పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ శిక్షణ

పి.గన్నవరం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంహైస్కూల్లో 9, 10, 11వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు రాజోలు మండలం తాటిపాకలో ఇండస్ట్రియల్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వృత్తి విద్యా కోర్సు రిటైల్ అమ్మకాలు అనే అంశంపై సమగ్ర శిక్ష, ఏఐఎస్ఈసిటీ ఆధ్వర్యంలో వ్యాపారానికి సంబంధించిన అవగాహన కోసం ఇండస్ట్రియల్ విజి ట్‌లో భాగంగా తాటిపాకలో ఒక వస్త్ర దుకాణాన్ని విద్యార్థులు సందర్శిం చారు. ఈసందర్భంగా వారికి రిటైల్ శిక్షణలో అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం పబ్లిక్ పరీక్షల సమయంలో ఓకేషనల్ పరీక్ష నిర్వహించి ఉత్తీ ర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తారని ట్రైనర్ పి.దుర్గాప్రసాద్ తెలి పారు. జీసీడీవో భీమారావు, హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సచిన్, ప్రమీల, పావనరమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్ విజయవంతం

రాజోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఐటీ, ఐటెస్ ఒకేషనల్ వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా బుధవారం భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారని రాజోలు పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి, ఐటీ ట్రైనర్ టి.దివ్యకృష్ణజ తెలిపారు. 9, 10, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం బాలికలు వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈవిజిట్‌లు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ ల్యాబ్స్, ఇంజనీరింగ్ ల్యాబ్స్ సందర్శన, వాటి పనితీరును బీవీసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు బాలికలకు వివరించారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.అనితకుమారి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల విజిట్

అల్లవరం,నవంబరు27(ఆంధ్రజ్యోతి): గోడిబాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ఐటీ, ఐటీఎస్ ఒకేషనల్ కోర్సులో భాగంగా భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇండస్ట్రియల్ విజిట్ విజయవంతమైందని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు. 9,10తరగతులు, ఇంటర్‌విద్యార్థులు వృత్తి, విద్యానైపుణ్యం, పెంపుదలకు ఐటీ విజిట్లు ఉపయోగపడతాయన్నారు. ట్రైనర్ కేవీ రమణ సూచనలు చేశారు. భట్లపాలెం ఐటీ ల్యాబ్స్, ఇంజనీరింగ్ ల్యాబ్స్ సందర్శించారు. బీవీసీ ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

అంబాజీపేట, నవంబరు27(ఆంధ్రజ్యోతి): గడ్డిలోడుతోవెళ్తున్నట్రాక్టర్ విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. పప్పులవారిపాలెం నుంచి గడ్డిలోడుతో ట్రాక్టర్ స్థానిక కొర్లపాటివారిపాలెం వస్తుంది. దీంతో స్థానిక కేవీపాలెం వద్దకు వచ్చేసరికి ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చెలరేగి గడ్డితో పాటు ట్రాక్టర్ కాలిపోయింది. రూ.80వేలు ఆస్తి నష్టం ఏర్పడింది. అమలాపురం అగ్నిమాపక అధికారి కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆపారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

అమలాపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో అనధికారికంగా మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న నల్లా తాతారావును ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి పి.బాలాజీ అరెస్టుచేసి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు అడపా సత్తిబాబు, ఇసుకపట్ల రాంబాబు, వటికూటి సోమన్న, పోలాబత్తుల ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు.

ధాన్యాన్ని తక్షణం మిల్లుకు తరలించాలి



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఏవో

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరబెట్టిన ధాన్యాన్ని తక్షణం రైస్ మిల్లులకు తరలించాలని ఆలమూరు తహశీల్దార్ ప్రకాష్‌బాబు, మండల వ్యవసాయాధికారిణి లక్ష్మిలావణ్య రైతులకు సూచించారు. బుధవారం పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పంట భూములలో ఆరబెడుతున్న ధాన్యం రాసులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరికోత కోయని రైతులు డిసెంబరు 2 వరకు వాయిదా వేసుకోవాలని వారు కోరారు. మండలంలో 9,350 ఎకరాల్లో సాగు జరగ్గా ప్రస్తుతం 7,500 ఎకరాల్లో కోతలు పూర్తి చేశారని ఏవో లక్ష్మిలావణ్య తెలిపారు.

పంట కోతలను నిలిపివేయాలి

కొత్తపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వాయుగుండం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి రైతులు ఐదు రోజుల పాటు పంట కోతలను నిలిపి వేయాలని కొత్తపేట తహశీల్దారు వై.రాంబాబు కోరారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇప్పటికే ఆరబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని వారికి కేటాయించిన మిల్లులకు తరలించాలన్నారు. వచ్చేనెల 2 వరకు వరికోతలు చేపట్టవద్దన్నారు.

తుఫాన్ హెచ్చరికతో రైతుల ఆందోళన



కోత దశలో ఉన్న వరి పొలాలు

రావులపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావానికి ఈదురుగాలులు వీస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో స్వర్ణరకం వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

వరికోతలు వాయిదా వేసుకోవాలి: తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉన్నందున వరికోతలు వాయిదా వేసుకోవాలని తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఏవో మీనా రైతులకు సూచించారు. తెలిపారు. కోసిన ధాన్యాన్ని వీలైనంత త్వరగా మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సులువుగా ధాన్యం విక్రయించుకునే ఏర్పాట్లు చేయాలి



దంగేరు రైతు సేవా కేంద్రం వద్ద డీఎంతో రైతులు

కె.గంగవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికలతో వరి పంటను సులభంగా దగ్గరలో ఉన్న మిల్లులకు తరలించుకునే ఏర్పాట్లు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం డీఎస్‌వో అడపా ఉదయభాస్కర్, సివిల్ సప్లయిస్ డీఎం ఎం.బాల సరస్వతి దంగేరు రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు రికార్డులను తనిఖీ చేశారు. దంగేరు గ్రామానికి చెందిన ఓబిళినేని సత్యనారాయణ చౌదరి ఆధ్వర్యంలో రైతులు డీఎస్‌వోకు తమ సమస్యలు తెలిపారు. రైతుల సమస్యలు విన్న వారు దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి రైతులకు ఇబ్బందుల లేకుండా చూస్తామని తెలిపారు.



మండపేట మండలం ఇప్పనపాడులో గౌరీశంకరుల ఊరేగింపు

ఘనంగా గౌరీశంకరుల ఉత్సవం

మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ఇప్పనపాడులో రెండేళ్లకోసారి జరిగే గౌరీ శంకరుల వేడుకలు నెల రోజుల ఉత్సవాల అనంతరం బుధవారంతో ముగిశాయి. గౌరీశంకరుల వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారిని నెలరోజుల పాటు పూజించటం ఆనవాయితీ. ఇక్కడ ప్రత్యేకంగా వరికంకులు తీసుకువచ్చి అమ్మవారి స్థానంలో ఉంచి పూజలు చేస్తారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా వాహనంలో ఊరేగించారు. అఘోరాల నృత్యాలు, హనుమాన్ వేషధారణ, కేరళ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపు అనంతరం అమ్మవారిని జెడ్.మేడపాడు వద్ద వున్న పంట కాల్వలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




సోమేశ్వరంలో కిశోర వికాసం ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినిలు, అంగన్‌వాడీలు

కిశోర వికాసంపై అవగాహన కలిగి ఉండాలి

రాయవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ మాచవరం సెక్టారు ఆధ్వర్యంలో కిశోర వికాసం నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు వి.విష్ణుకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, కిశోర బాలికల్లో శారీరక, మానసికంగా ఎదురయ్యే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో విద్యార్థినిలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ, మానవహారం జరిపారు.

బాలల కథా రచనల్లో పాల్గొనండి

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాలల్లో దాగిన ఉన్న రచనలను వెలికి తీయడానికి బాలల కథా రచన పోటీలు ఎంతో దోహదపడతాయని అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్వర్యంలోని బాల మందిరం అధ్యక్షుడు అంగర గోపాలకృష్ణార్యులు(కృష్ణశ్రీ) అన్నారు. ఆలమూరు మండలం సంధిపూడి జడ్పీహైస్కూల్‌లో బుధవారం పోటీల బోచర్స్‌ను విడుదల చేశారు. బాల మందిరం, గోదావరి బాలోత్సవం అధ్వర్యంలో వచ్చేనెల 1న రాజమహేంద్రవరం ఎస్‌వీటీ కాలేజీ ఆవరణలో బాలల కథా రచన పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో పాల్గొన దలచిన వారు 30లోపు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. 99631 63136కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.



సంధిపూడి హైస్కూల్‌లో బాలల కథా రచన పోటీల బోచర్స్‌తో కృష్ణశ్రీ, విద్యార్థులు

ఆరోగ్య ప్రదాత ధన్వంతరి

• చింతలూరులో తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయం • నేడు ధన్వంతరి జయంతి

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత ధన్వంతరి దర్శనంతో సర్వరోగ నివారణ స్వామిగా ఈయన్ను కొలుస్తుంటారు. ఇంతటి శక్తిగల ధన్వంతరి ఆలయం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయంగా ఆలమూరు మండలం చింతలూరులో ఉంది. ఆయుర్వేద రంగానికి ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఈయన కరుణా కటాక్షాలతో ఆయుర్వేద రంగం కొనసాగుతోందని పలువురు ఆయుర్వేద పండితుల విశ్వాసం. ధన్వంతరి స్వామి కటాక్షంతో ఆయుర్వేద పండితుడు, వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం వ్యవస్థాపకులైన వైద్యరాజ ద్విభాష్యం వేంకటేశ్వర్లు ధన్వంతరిస్వామి ఆలయాన్ని ఆలమూరు మండలం చింతలూరులో 1942లో ప్రతిష్ఠించి నిత్యధూప నైవేద్యాదులకు శాస్వత భూ వసతి కల్పించారు. వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం ప్రస్తుతం మేనేజింగ్ డైరెక్టర్ ద్విభాష్యం వెంకటశ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ధన్వంతరి ఆలయాన్ని పునరుద్ధరణ చేసి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయంగా ఉండటంతో ధన్వంతరి స్వామిని దర్శించుకోవడానికి అనేక ప్రాంతాల నుంచి ఇక్కడకి వస్తుంటారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి: ఆరోగ్య ప్రదాత ధన్వంతరి జయంతిని నేడు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి దర్శనం కోసం జిల్లా నుంచే కాకుండా తెలుగు రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.





చింతలూరులోనున్న ధన్వంతరిస్వామి.పక్క చిత్రంలో చింతలూరులోని ధన్వంతరి ఆలయం

డిజిటల్ అరెస్టుపై అవగాహన

రావులపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్సు అధ్యాపకురాలు డాక్టర్ యు.సుభాషిణి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన డిజిటల్ అరెస్టుపై సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది ఎ.భాస్కర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.



వల్లూరులో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ఘనంగా ఏకాహం

కపిలేశ్వరపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరులో నున్న వేంకటేశ్వస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి ఏకాహం జరిగింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకు సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన వల్లూరి వీరబాబు దంపతులు స్వామివారికి పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి, శివాలయాల్లో జరిగిన ఈ పూజల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ద్వాదశి సందర్భంగా కార్తీక దీపారాధన ఉత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ముత్యాల శ్రీధర్, వల్లూరి వీరబాబు, సహకార సొసైటీ కార్యదర్శి వేగుళ్ళ వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

రాయవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నగదు అపహరించినట్లు రైతు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బుజ్జిబాబు బుధవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం...సోమేశ్వరం గ్రామానికి చెందిన గరగ తంబయ్య మంగళవారం నాడు ధాన్యం అమ్మగా వచ్చిన 30వేలను సంచిలో పెట్టుకుని ఆటోలో ప్రయాణిస్తు న్నారు. మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు నగదు అపహరించుపోయినట్టు తంబయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు.

జీవిత బీమా ఏజెంట్ల నిరసన

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల జీవిత బీమా పాలసీలు నిబంధనలు మార్పు, ఏజెంట్ల క్లాబ్యాక్ క్లాజులను నిరసిస్తూ లియాఫి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రామచంద్రపురం బ్రాంచి కార్యాలయం వద్ద ఏజెంట్లు నిరసన తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం వద్ద ఏజెంట్లు నిరసన జరిపారు. ఈ సందర్భంగా లియాఫీ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కెఎంఎంకె మస్తాన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏజెంట్ల అసోసియేషన్ బ్రాంచి నాయకులు రౌతు లక్ష్మీగణేష్, కృష్ణారావు అధిక సంఖ్యలో ఏజెంట్లు పాల్గొన్నారు.

నీరు ఇలా ఉంటే తాగేదెలా..?

ఓదూరులో తాగునీటికి కటకట

7 రోజులుగా నీరులేక అవస్థలు



ఓదూరులో కళాయి ద్వారా వస్తున్న నీరు

ద్రాక్షారామ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఓదూరులో వారం రోజులుగా గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. సమీప గ్రామం యనమదల నుంచి పంచాయతీ సరఫరా చేసే నీరే ఆధారంగా మారింది. ఓదూరు, శివారు గ్రామానికి ఉదయం, సాయంత్రం నీరును సరఫరా చేస్తున్నారు. ఈనెల 19 నుంచి కుళాయిల్లో రంగుమారి నీరు వస్తోంది. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. మంగళ, బుధవారాల్లో నీటి సరఫరా నిలిపివేశారు.

గ్రామంలో అంతా ఉప్పునీరు: ఓదూరు గ్రామంలో భూగర్భ జలాలు ఉప్పుగా ఉంటాయి. దీంతో యనమదల గ్రామంలో మోటార్లు బిగించి పైపు లైను ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నీటి సరఫరా ఆగిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. నరసాపురపుపేట, వేళంగి గ్రామాలకు వెళ్లి తాగునీరు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తాగునీరు పునరుద్ధరించాలని మాజీ సర్పంచ్ కొండేపూడి జానకిరామయ్య, తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. నోము ఆచరిస్తున్న మహిళలు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.4,61,231 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రిపూజ

వాడపల్లిలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం లక్షపత్రిపూజను జరిపారు. మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, త్రిశూలార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తుఫాను ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి



లొల్లలో రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రభాకర్

రాయవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది జరిపారు. కార్యక్రమంలో ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో గురువారం నుంచి వచ్చేనెల 2 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులంతా ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. వరికోతలు చేపట్టని రైతులు 5 రోజులు వాటిని వాయిదా వేసుకోవాలని సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను ఏవో పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ విస్తరణ అధికారి శివశంకర్, వ్యవసాయ సహాయకులు మణికంఠ, తేజ, ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తడిసిపోకుండా చర్యలు చేపట్టాలి: ధాన్యం తడవకుండా సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టాలని తహశీల్దారు ఐపీ శెట్టి రైతులకు సూచించారు. వరికోతలు జరపని రైతులు వాటిని వాయిదా వేసుకోవాలన్నారు. తహశీల్దారు కార్యాలయంలో ఏర్పా టు చేసిన 72075 80849, 83094 32487, 94416 94475 ఫోన్‌లో రైతులు సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా బ్రూస్లీ జయంతి

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కరాటే వీరుడు బ్రూస్లీ జయంతిని కొత్తూరు సెంటర్లో బుధవారం కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు అధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ అబ్బులు ఏర్పాటు చేసిన ఉచిత కరాటే కుంగ్‌ఫూ, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్, సలాది నాగేశ్వరరావు, గుంటూరు సత్యనారాయణ, టి.అబ్బులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే వేగుళ్లను అభినందించిన రజకులు

మండపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పట్టణంలోని 9వ వార్డుకు చెందిన రజక సంఘం నాయకులు బుధవారం అభినందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు టేకి బీమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అవిడి సత్యనారాయణ, కార్యదర్శి టేకి వేంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగుళ్లను అభినందిస్తున్న దృశ్యం

సైబర్ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో శారద

కొత్తపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైబర్ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీవో పి.శారద పేర్కొన్నారు. బుధవారం విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్తపేట లీగల్‌సెల్, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాల నివారణ, సైబర్ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని జరిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సీడీపీవో పి.శారద పాల్గొ న్నారు. ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యులు ఏటీ ప్రభాకరరావు, వి.బాలప్రతాప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుండలేశ్వరంలో భక్తుల పూజలు

కాట్రేనికోన, నవంబరు27(ఆంధ్రజ్యోతి):బుధవారం అధికసంఖ్యలో భక్తులు కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో చెయ్యేరుకు చెందిన బసవా లక్ష్మణరావు, అడపా శ్రీను, ఉంగరాల సత్యనారాయణ, చేగొండి రామకృష్ణభాస్కరరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో 3000మంది భోజనాలు చేశారు. ఎస్‌ఐ అవినాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈవో ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.

భీమేశ్వరస్వామి దేవస్థానం టెండర్లు పరిశీలన

ద్రాక్షారామ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానానికి కిరాణా, పూజా సామగ్రి, పారిశుద్య సామగ్రి సరఫరా చేసేందుకు పిలిచిన టెండర్లను బుధవారం అధికారులు తెరిచారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీ రామ్ ప్రసాద్ పర్యవేక్షణలో టెండర్లు తెరిచి పరిశీలించారు. తక్కువ ధరలకు సరఫరా చేసే టెండరును ఎంపిక చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపుతామని తెలిపారు.

డీఎస్పీ విచారణ

ఆత్రేయపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఒక యువతితో గొడవపడి కులం పేరుతో దూషించిన ఘటనపై బుధవారం కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు విచారణ జరిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన మద్దాల నిరీక్షణ ఆత్రేయపురం కాలువరేవులోని పూతరేకుల షాపులో పనిచేస్తున్నది. ఈ నెల 5న పక్క షాపులో ఉన్న చింతా మారియ్య పూతరేకుల వ్యాపారంలో ఆమెతో గొడవపడి కులం పేరుతో దూషించాడు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేయగా, డీఎస్పీ బుధవారం విచారణ జరిపారు.

కొత్తపేట కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా విద్యా ప్రసన్న



కొత్తపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సీనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఇన్‌చార్జి)గా ఆలమూరు కోర్టు ఏజీపీ బూసి విద్యాప్రసన్నను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఆలమూరు ఏజీపీతోపాటు కొత్తపేట కోర్టు ఏజీపీగా అదనపు బాధ్యతలు అప్పగించడంపై అధికారులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



మంత్రి సుభాష్‌కు విరాళం ఇస్తున్న దాతలు

ధ్వజస్తంభం నిర్మాణానికి విరాళం

ద్రాక్షారామ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరం గ్రామంలోఉన్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం ధ్వజస్తంభం నిర్మాణానికి వత్సవాయి వీరవెంకట నరసింహరాజు, నాగలక్ష్మి దంపతులు రూ 1,01,116 విరాళం అందించారు. బుధవారం ఆల యం సందర్శనకు వచ్చిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు దాతలు విరాళం సొమ్ము ఇవ్వగా గ్రామ పెద్దలకు ఆయన అందచేశారు. 2020లో సత్యనారాయణరాజు, సుబ్బలక్ష్మీ దంపతులు ఆలయానికి రంగులు వేసేందుకు రూ.30 వేలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్, పెద్దలు ములగపాటి సత్యనారాయణరాజు, ఎం.వీరబాబు, వీఆర్‌వో నరహరిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ద్వారా మరిన్ని సేవలు

మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం పట్టణంలోని పెద్దకాల్వ వద్ద వున్న యేసుక్రీస్తు మహిమ అవరణలో బుధవారం సంగీతాపాల్ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌పాల్, నార్త్ ఈస్టు ఇన్‌చార్జి నందకుమార్ గురుంగలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంగీతాపాల్ మాట్లాడుతూ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సమావేశంలో రెవరెండ్ బిషప్ సంజయ్ ఆనంద్, ఎన్‌సీసీ జార్ఖండ్ అధ్యక్షులు సాల్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కామన నియామకం

మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావును మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకంపై నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు కామనను అభినందించారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు బుధవారం మంత్రి సుభాష్‌ను కలిశారు. డిసెంబరు 2న రామచంద్రపురం యేసు ప్రేమాలయం చర్చి ఆవరణలో జరగనున్న క్రిస్మస్ వేడుకలకు ఆయన్ను ఆహ్వానించారు. ఫెలోషిప్ నాయకులు రెవరెండ్ డా.జి.విజయరాజు, విజయరత్నం, సురేష్‌కుమార్, కాలేబు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయ కుడు డి.శ్రీధర్ పాల్గొన్నారు.

ఏకాదశ రుద్రుల దర్శనానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగుస్తుండటంతో ఏకాదశ రుద్రుల దర్శనానికి దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తులు ఒకేరోజు 11రుద్రులను దర్శించుకునేందుకుబారులు తీరుతున్నారు.